# మనం

## కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు

శనివారం | 19 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 15


## మెనూ ప్రకారం ఆహారం అందాలి



2 లో






4 లో



-చందర్లపాడు/విజయవాడ,మనం బ్యూరో

# పచ్చదనంతోనే... ఆరోగ్యకరమైన భవిష్యత్తు

పి.మీరాహుస్సేన్ ఖాన్

పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, కాలుష్య నియంత్రణ, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పాటులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. నెట్ జీరో-ఆరోగ్యకరమైన క్యాంపస్ కార్యక్రమంలో నెట్ జీరో-ఆరోగ్యకరమైన క్యాంపస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలోని గురుకుల పాఠశాలలో 'అనంత ఆరణ్య ప్లాంటేషన్' కార్యక్రమాన్ని నిర్వహించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి..
ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి
జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

### నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కారంలో...

## జాప్యానికి తావులేకుండా చర్యలు

అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్రూవ్ చేయాలి

పింఛన్ మంజూరు కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేసినా, ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసినా కఠిన చర్యలు

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది పనితీరును ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



3 లో

## గుంటూరు జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యం



2 లో

- జనవరిలో తెనాలి వేదికగా 'నంది నాటకోత్సవాలు'...
- రెండు రోజుల్లో సినిమా, టీవీ అవార్డుల నోటిఫికేషన్
- తాగునీటి ఎద్దడి లేకుండా అమరజీవి జలధార, జల్ జీవన్ మిషన్ 2.0 పనులు వేగవంతం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు
- జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్

# మెనూ ప్రకారం ఆహారం అందాలి



▶▶ జిల్లా కలెక్టర్

**సి.యం.సాయికాంత్ వర్మ**

**గుంటూరు, సెప్టెంబర్ 18 : (మనం న్యూస్ ప్రతినిధి)** మెనూ ప్రకారం వసతి గృహాలు, అంగన్వాడీ, పాఠశాల విద్యార్థులకు ఆహారం అందాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు.వివిధ శాఖల అధికారులతో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ లేదని స్పష్టం చేశారు.గుడ్లు నాణ్యమైనవిగా ఉండాలని,పాడైన గుడ్లు పెడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి సమాచారం అందించాలని అన్నారు.అన్నా క్యాంటీన్ లలో సైతం ఆహార పదార్థాల నాణ్యతలో రాజీపడరాదని అన్నారు. పురపాలక సంఘాల పరిధిలో పారిశుధ్యం నిర్వహణ, పూడికలు తీయడంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త పింఛన్ల మంజూరు మాత్రమే కాకుండా, పింఛన్ల పంపిణీలో ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీలు అందజేయాలని స్పష్టం చేశారు. విద్యా శాఖలో స్టార్ రేటింగ్ లను మెరుగు పరచాలని ఆదేశించారు. నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులకు రూపొందించిన యాప్ లలో సమాచారాన్ని పొందుపరచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి,జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.జి.ప్రసూన, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.శ్రీనివాస్,ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్. శ్రీనివాస మూర్తి,రహదారులు భవనాలు శాఖ కార్యనిర్వహక ఇంజనీర్ సి.విశ్వనాథరెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి.దుర్గాబాయి,జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జె.పార్థసారథి, జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా తదితరులు పాల్గొన్నారు.

# కొమ్మమూరి బ్రిడ్జిని తక్షణమే పూర్తి చేయాలి

▶▶ అంబటి మురళీకృష్ణ

**అమరావతి,సెప్టెంబర్,18,(మనం ప్రతినిధి):** గుంటూరు -బాపట్ల ప్రధాన రహదారిపై చేబ్రోలు వద్ద కొమ్మమూరు బ్రిడ్జి పునర్నిర్మాణం కోసం 43 కోట్లు కేటాయించి నిర్మాణం చేపట్టిన వైఎస్ జగన్ మోహనరెడ్డి పనులను నిలుపుదల చేసిన కూటమి ప్రభుత్వం వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులను పునఃప్రారంభించాలని కోరుతూ 25,000 సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది, దానిలో భాగంగా శుక్రవారం చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెం₹ గ్రామంలో ₹పొన్నూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ ఇంటింటికి తిరిగి ప్రజల నుండి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ కొమ్మమూరి బ్రిడ్జిని తక్షణమే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు, లేదంటే రాబోవు రోజుల్లో ప్రజా ఉద్యమం తప్పదని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలు అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు బొకినాల ఆధ్వర్యంలో నెమలి గణపతి

▶▶ హనుమాన్ జంక్షన్ బస్ స్టేషన్ వద్ద వైభవంగా జరుగుతున్న గణపతి ఉత్సవాలు



**హనుమాన్ జంక్షన్: సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ):** హనుమాన్ జంక్షన్ లో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. విజయవాడ రోడ్ లోని ఆర్టీ సి బస్ స్టేషన్ సెంటర్ లో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు బొకినాల సాంబశివరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 11 అడుగులు ఉన్న నెమలి గణపతి విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. గత 5 సంవత్సరాలుగా వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేస్తున్నట్లు బొకినాల సాంబశివరావు చెప్పారు. ఈ విగ్రహం వద్ద ఏర్పాటు చేసేందుకు 11 కిలోల స్వచ్ఛమైన లడ్డూను తల్లి స్వీట్స్ అధినేత కటకం నాగు అందజేశారు . శుక్రవారం పూజా కార్యక్రమాలతో జలసూత్రం తేజ, చందు దంపతులు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో పోతకమూరి బాబు, కమ్మిలి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



# గుంటూరు జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యం

- జనవరిలో తెనాలి వేదికగా 'నంది నాటకోత్సవాలు'...
- రెండు రోజుల్లో సినిమా, టీవీ అవార్డుల నోటిఫికేషన్
- తాగునీటి ఎద్దడి లేకుండా అమరజీవి జలధార, జల్ జీవన్ మిషన్ 2.0 పనులు వేగవంతం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు
- జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్

**గుంటూరు,సెప్టెంబర్, 18,(మనం ప్రతినిధి):** గుంటూరు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎస్.ఎన్. శంకరన్ హాల్ నందు శుక్రవారం జిల్లా సమీక్షా సమావేశం ఫలప్రదంగా జరిగింది.. ఈ సమావేశానికి గుంటూరు జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర, మాధవి, శ్రవణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ, మునిసిపల్ కమిషనర్ మయూర్ అశోక్ మరియు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. డీఆర్సీ సమావేశంలో ఎల్ నినో ప్రభావం, ఎరువుల కొరత,పంట మద్దతు ధర, నిత్యావసర వస్తు ధరలు, కౌలు రైతుల సమస్యలు,జల్ జీవన్ మిషన్ 2.0 పనులు, ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ లకు దరఖాస్తుల స్వీకరణ, సూపర్ సిక్స్ పథకాల అమలు తీరు తదితర పై చర్చలు జరిపామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు.అమరజీవి జలధార ప్రాజెక్టు రెండవ దశ పనులను శరవేగంగా పూర్తి చేయాలని, జల్ జీవన్ మిషన్ 2.0 పనులను వేగవంతం చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు...జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 50,527 మంది నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రాథమికంగా 1,081 దరఖాస్తులను ఆమోదించినట్లు అధికారులు తెలిపారని అన్నారు.. సీఎం ఆలోచనలకు అనుగుణంగా పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. హౌస్ హోల్ సర్వే సమస్యలను ఇప్పటికే ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపారు. జిల్లాలో 13,657 మంది రైతుల నుండి ఇప్పటివరకు 91,178 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, పొన్నూరు నియోజకవర్గంలో అత్యధికంగా సేకరణ జరిగిందని వెల్లడించారు. ఎరువుల కొరత రాకుండా చూడాలని, బ్లాక్ మార్కెటింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశామన్నారు. దీపం పథకం కింద 5 దశల్లో రూ. 168 కోట్ల లబ్ధితో 20,25,565 మందికి ప్రయోజనం చేకూరిందని తెలిపారు.గత ప్రభుత్వం నాటక రంగాన్ని, కళాకారులను తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి దుర్గేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కళాకారులకు పెద్దపీట వేస్తూ కందుకూరి, ఉగాది కళారత్న, గుర్రం జాషువా, బోయి భీమన్న, గిడుగు రామమూర్తి పంతులు పేరిట పురస్కారాలను ఇస్తోందన్నారు.. సినిమా, టీవీ, నాటక రంగాల అవార్డుల



ప్రదానానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా ఉన్నారని, మరో రెండు రోజుల్లో ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడుతుందని తెలిపారు. గుంటూరు జిల్లా సాంస్కృతిక ప్రాశస్త్యాన్ని ప్రతిబింబించేలా రాబోయే జనవరి నెలలో తెనాలి వేదికగా 'నంది నాటకోత్సవాలు' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన ప్రకటించారు. జనవరి నాటికి అవార్డుల ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.డీఆర్సీ సమావేశంలో లేవనెత్తిన ప్రజా సమస్యల పరిష్కారం దిశగా అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రభుత్వ ప్రజాసంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. అంతకుముందు జరిగిన జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష కమిటీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, బ్యాంకింగ్ అధికారులు పాల్గొని పలు ఆర్థిక, అభివృద్ధి అంశాలపై చర్చించారు.

# 100 గిగావాట్ల లక్ష్యానికి ఊతం.. తయారీ, ఆఫ్షోర్ పవన విద్యుత్, రీపవరింగ్‌పై విండర్జీ ఇండియా 2026 దృష్టి

**విజయవాడ,సెప్టెంబర్,18,(మనం న్యూస్):** విండ్ - భారత ఇంధన స్థితిస్థాపకతకు శక్తి' అనే ఇతివృత్తంతో విండర్జీ ఇండియా 2026 ఎనిమిదో ఎడిషన్ అక్టోబర్ 7 నుంచి 9 వరకు చెన్నై ట్రేడ్ సెంటర్లో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులుతెలిపారు. దేశంలో పవన విద్యుత్ రంగం వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే 58 గిగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యాన్ని దాటిన ఈ రంగం.. 2030 నాటికి 100 గిగావాట్ల లక్ష్యాన్ని చేరుకునే దిశగా అడుగులు వేస్తోందన్నారు. స్వచ్ఛ ఇంధన ఉత్పత్తితో పాటు పారిశ్రామిక, ఎగుమతి రంగాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్న పవన విద్యుత్ రంగం సామర్థ్యాలను 'విండర్జీ ఇండియా 2026' ప్రదర్శించనుందని చెప్పారు. భారత్ ఇంధన మార్పిడి ప్రక్రియ కేవలం మెగావాట్ల సామర్థ్యాన్ని పెంచడానికే పరిమితం కాదు. నైపుణ్య ఉద్యోగాలను సృష్టించే, తయారీ రంగానికి ఊతమిచ్చే, ఎగుమతులను పెంచే, ఇంధన భద్రతను బలోపేతం చేసే సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉంది. దిగుమతి చేసుకునే, ధరల్లో తీవ్ర మార్పులకు లోనయ్యే శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా మొత్తం వ్యవస్థ వ్యయాన్ని కూడా తగ్గించవచ్చు'' అని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ (ఎంఎన్ఆర్ఈ) సంయుక్త కార్యదర్శి రాజేశ్ కుల్హారి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఏకంగా 6.05 గిగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యం కొత్తగా చేరింది. ఒక ఆర్థిక సంవత్సరంలో నమోదైన అత్యధిక వార్షిక సామర్థ్య పెరుగుదల ఇదే. దీంతో 2026 ఆగస్టు 31 నాటికి దేశంలో మొత్తం పవన విద్యుత్ స్థాపిత సామర్థ్యం 58.52 గిగావాట్లకు చేరిందన్నారు. 2030 నాటికి 100 గిగావాట్ల లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏటా సుమారు 10 గిగావాట్ల కొత్త సామర్థ్యాన్ని జోడించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దాదాపు 43 గిగావాట్ల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉండటం ఈ లక్ష్య సాధనకు కీలకంగా మారనుందని చెప్పారు. దేశీయ పవన ట్బన్ తయారీ సామర్థ్యం 2014లో ఏడాదికి 10 గిగావాట్లుగా ఉండగా.. ప్రస్తుతం 24 గిగావాట్లకు చేరింది. దేశీయంగా తయారయ్యే ఉత్పత్తుల్లో విలువ జోడింపు 70-80 శాతంగా ఉన్నట్లు అంచనా ఉందని తెలిపారు. ఎంఎన్ఆర్ఈ ఇండియన్ విండ్ ట్బన్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐడబ్ల్యూటీఎంఏ)తో కలిసి దేశంలో తొలి పవన విద్యుత్ సరఫరా గొలుసు పోర్టల్ 'డబ్ల్యూటీ మారుట్ ను ప్రారంభించిందని ఐడబ్ల్యూటీఎంఏ వైస్ ఛైర్మన్, కార్యదర్శి డాక్టర్ శరవణన్ మణిక్కం తెలిపారు. 'పవన విద్యుత్ రంగం తొలినాళ్లలోని చిన్న పరిశ్రమ స్థాయి నుంచి 58 గిగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యం కలిగిన రంగంగా ఎదిగింది. ప్రస్తుతం మన దేశంలో తయారైన ట్బన్లు ప్రపంచ మార్కెట్లకు ఎగుమతవుతున్నాయి. ఇక ముందున్న లక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయి. 2030 నాటికి 100 గిగావాట్లు, 2035 నాటికి 155 గిగావాట్ల సామర్థ్యాన్ని చేరుకోవాలి. ఈ లక్ష్యాల కోసం తయారీదారులు, ప్రాజెక్టు అభివృద్ధిదారులు, విధాన నిర్ణేతలు, సాంకేతిక ఆవిష్కర్తలు కలిసి పనిచేయాలి'' అని ఐడబ్ల్యూటీఎంఏ కార్యదర్శి, సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్ కార్పొరేట్ అఫైర్స్ అండ్ రిటైల్ బిజినెస్ అధ్యక్షుడు దినేశ్ జగ్దాలే తెలిపారు.

windergy INDIA 2026 WIND POWER FOREVER

# నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు

**▸▸ అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్రూవ్ చేయాలి**

**▸▸ పింఛన్ మంజూరు కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేసినా, ఉద్దేశపూర్వకంగా జాప్యం చేసినా కఠిన చర్యలు**

**▸▸ స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది పనితీరును ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలి**

**▸▸ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

విజయవాడ, సెప్టెంబర్ 18(మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సామాజిక భద్రతా పింఛన్ పథకంలో భాగంగా పెంచిన పింఛన్ మొత్తాలను లబ్ధిదారులకు అందజేయడంతో పాటు, నూతనంగా అర్హత పొందిన వారికి పింఛన్లు మంజూరు చేసేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు.చందర్లపాడులో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న సందర్భంలో మార్గమధ్యంలో సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, జిల్లాలో నూతన పింఛన్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ఆన్లైన్ అప్రూవల్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. నూతన పింఛన్ దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 18వ తేదీతో గడువు ముగియనున్న నేపథ్యంలో, ఇప్పటివరకు స్వీకరించిన దరఖాస్తుల పరిశీలనను పూర్తిచేసి, నిబంధనల మేరకు అర్హత కలిగిన దరఖాస్తులను ఆన్లైన్లో అప్రూవ్ చేసే ప్రక్రియను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యానికి అవకాశం ఇవ్వకుండా క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కారం లేదా ఆన్లైన్ అప్రూవల్ కోసం లబ్ధిదారుల నుంచి ఏటువంటి రుసుములు,



డబ్బులు డిమాండ్ చేయరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. లబ్ధిదారుల నుంచి డబ్బులు ఆశించడం, దరఖాస్తుల పరిష్కారంలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం, అధికారిక ప్రక్రియను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం లేదా పింఛన్ నేనే చేయాలి.. నేను చేయకపోతే అవ్వదు అనే విధంగా వ్యవహరించడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఇటువంటి చర్యలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే సంబంధిత సిబ్బందిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి, అర్హత ఉన్న లబ్ధిదారులకు పింఛన్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా అనవసర కారణాలతో పింఛన్ ప్రయోజనం కోల్పోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అదే సమయంలో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హత లేని దరఖాస్తులను నిబంధనల ప్రకారం మాత్రమే పరిష్కరించాలని, మొత్తం ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిశీలన, ఆన్లైన్ అప్రూవల్ ప్రక్రియలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది కీలక బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. దరఖాస్తుల పురోగతి, పెండింగ్లో ఉన్న దరఖాస్తులు, అర్హత నిర్ధారణ, ఆన్లైన్ అప్రూవల్ తదితర అంశాలను క్రమం తప్పకుండా సమీక్షించి, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కారంలో అర్హులైన లబ్ధిదారుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్క దరఖాస్తు కూడా నిర్లక్ష్యం కారణంగా పెండింగ్లో ఉండకూడదని, అర్హత ఉన్నప్పటికీ అనవసరంగా తిరస్కరణకు గురికాకూడదని స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను నిబంధనల మేరకు సకాలంలో పరిష్కరించడంలో విఫలమయ్యే సిబ్బందిపై బాధ్యతను నిర్ధారించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం ఒక కుటుంబంలో అర్హత కలిగిన ఒక్క లబ్ధిదారుడికి మాత్రమే పింఛన్ పొందే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. భవిష్యత్లో ఒకే కుటుంబంలో అర్హత కలిగిన ఇతర సభ్యులకు కూడా పింఛన్ మంజూరు చేసే అంశంపై ప్రభుత్వం పరిశీలనలో ఉంచినట్లు ఈ సందర్భంగా తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం ప్రతి కుటుంబంలో అర్హత కలిగిన ఒక లబ్ధిదారుడికి పింఛన్ ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతన పింఛన్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను డివిజనల్ డెవలప్మెంట్ అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్లో జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డివిజనల్ డెవలప్మెంట్ అధికారులు, సంబంధిత ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నందిగామలో శివాలయం కోనేరు చుట్టు అక్రమణలు తక్షమే తొలగించాలి



**▸▸ సమస్య పరిష్కరించాలని రీలే నిరాహారదీక్షలు**

**▸▸ పవిత్ర కోనేరులో అక్రమ తోలగించకపోతే ఉద్యమం తీవ్రతరం**

నందిగామ,సెప్టెంబర్,18,(మనం న్యూస్): శివాలయ కోనేరు ఆక్రమణలు తొలగించా లంటూ కోనేరు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలలో ఈరోజు క్లాత్ మర్చంట్ అసోసియేషన్ పలువురు సభ్యులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు అనుమోలు వెంకట శ్రీనివాస్ రావు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాలున్నా అధికారుల ఉదాసీనతపై ఆగ్రహం ఆక్రమణలు తొలగించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తూ పవిత్రమైన కోనేరు స్థలాన్ని ఆక్రమణల నుండి విముక్తి చేయాలని గౌరవ హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చినప్పటికీ, సంబంధిత అధికారులు కలెక్టర్ కి పలుమార్లు విన్నవించినప్పటికీ నిర్లక్ష్యంగా, మొండి వైఖరితో వ్యవహరించడం శోచనీయమన్నారు. కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ కాలయాపన చేయడం దారుణమని మండిపడ్డారు. యంత్రాంగం ఇప్పటికైనా తక్షణమే స్పందించి కోనేరు ఆక్రమణలను శాశ్వతంగా తొలగించకపోతే, నందిగామ పట్టణ బంద్ చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కోనేరు స్థలమును ఆక్రమించిన ప్రదేశంలో ఉన్న నిరుపేదలకు ప్రభుత్వం వారు తక్షణమే స్థలములు కేటాయించి వారిని కాళీ చేయించి శ్రీవారి కార్యక్రమాలైనా తె ప్పోత్సవం, మరియు స్వామి వారికి జరుగు విశేష కార్యక్రమలు జరిగే విధముగా ప్రభుత్వము వారు సహకరించాలని, హిందువుల మనోభావాలను గుర్తించాలని కోరారు. ఈ నిరాహార దీక్షా శిబిరంలో ది క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు అనుమోలు వెంకట శ్రీనివాసరావు, చవట పాప, మహంకాళి వెంకటేశ్వరరావు, చవట నవీన్, ఏచూరి నాగరాజు, తాతా సంతోష్, లింగమల్లు నాగేశ్వరరావు, నకరికంటి శ్రీనివాసరావు, మహంకాళి లక్ష్మీనారాయణ, గోపు సుధాకర్, మహంకాళి ప్రసాద్, పి. సుభాని, మణి, చవట సురేష్, మారం లక్ష్మీనరసింహ, పాదర్తి విశ్వేశ్వరరావు, పారేపల్లి బెనర్జీ, చేజర్ల గోపీనాథ్, చవట సుధాకర్ తదితరులు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని పట్టణ ప్రముఖులు, హిందూ భక్తులు వివిధ వ్యాపార వర్గాలు వారు పాల్గొన్నారు.




## ఐనంపూడిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

**▸▸ పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజాతో కలిసి నిర్మాణ పనులు పరిశీలన**



ఐనంపూడి(పామర్రు): సెప్టెంబరు 18,(మనం న్యూస్): నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా పామర్రు మండలం ఐనంపూడిలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సును జిల్లా కలెక్టర్ డీకే బాలాజి శుక్రవారం పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజాతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐనంపూడిలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు మొత్తం 10 ఎకరాల భూమి కేటాయించగా, అందులో 6.62 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. తొలిదశలో సుమారు 2 ఎకరాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సును నిర్మిస్తున్నామని, ఇందులో 26 షెడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో షెడ్డు సుమారు 1,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని వివరించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్థానిక ఔత్సాహికులు తమ యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు ఈ షెడ్లను లీజు ప్రాతిపదికన ప్లగ్ అండ్ ప్లే విధానంలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైన అప్రోచ్ రహదారి కోసం కొంత భూసేకరణ చేపట్టాల్సి ఉందని, అది పూర్తయితే కాంప్లెక్సు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావచ్చని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల్లో ఐనంపూడి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ కూడా భాగమని అధికారులు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం ద్వారా స్థానికంగా చిన్న, మధ్యతరహా పారిశ్రామిక యూనిట్లకు ప్రోత్సాహం లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్లో జరుగుతున్న నిర్మాణ పనులు, మౌలిక వసతులు, అప్రోచ్ రహదారి తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.కలెక్టర్ వెంట ఉయ్యూరు ఆర్డిఓ ఎస్ కరుణ కుమారి, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.





# పచ్చదనంతోనే...

# ఆరోగ్యకరమైన భవిష్యత్తు

**మొక్కలు నాటి సంరక్షించాలి..**
**ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**(చందర్లపాడు,విజయవాడ,మనం బ్యూరో):** పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, కాలుష్య నియంత్రణ, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పాటులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు.నెట్ జీరో -ఆరోగ్యకరమైన క్యాంపస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలోని గురుకుల పాఠశాలలో 'అనంత ఆరణ్య ప్లాంటేషన్' కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య తోకలిసి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ స్వయంగా మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పచ్చదనం పెంపుతో విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. నాటిన మొక్కలను సంరక్షించి అవి వృక్షాలుగా ఎదిగేలా చూడాలని సూచించారు. అనంతరం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చందర్లపాడు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలు ర్యాలీలో పాల్గొని పరిశుభ్రమైన గ్రామం-పచ్చని గ్రామం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. గ్రామంలో పరిశుభ్రత పాటించడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం ఒక్కటే కాకుండా వాటిని నిరంతరం సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలను కోరారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, పచ్చదనం ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో నందిగామ ఆర్డీవో గడ్డిపాటి అనిల్ కుమార్, డిపిఓ సీతా మహాలక్ష్మి, తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వర రావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.
















# బాపులపాడులో రూ.6.44 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి



**బాపులపాడు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన విప్ , ఎంఎల్ ఏ యార్లగడ్డ**

**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ):** రాబోయే రోజుల్లో గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు.మండల కేంద్రమైన బాపులపాడు గ్రామంలో హనుమాన్నగర్లో రూ.21.50 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, ఇందిరానగర్లో రూ.42 లక్షల వ్యయంతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్)ను ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్థానిక కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపులపాడు మండల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రానున్న రోజుల్లో గన్నవరం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు.గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి దూరమైన గ్రామాలను ఒక్కొక్కటిగా ప్రగతి బాట పట్టిస్తున్నామని తెలిపారు. బాపులపాడు గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో అధ్వానంగా మారిన రహదారుల స్థానంలో 68 సీసీ రోడ్లను నిర్మించామని ఎమ్మెల్యే తెలిపారు. బాపులపాడు గ్రామంలో రూ.6.44 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని, మడిచెర్ల గ్రామంలో రూ.5.60 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. మల్లవల్లి పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి కమిటీ మరింత బాధ్యతాయుతంగా పనిచేసి ప్రాంత పురోగతికి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామం మధ్యలో నిర్మించాల్సిన ఆరోగ్య కేంద్రాన్ని రూ.42 లక్షలతో గ్రామానికి ఒక మూలన నిర్మించారని అన్నారు. ఆసుపత్రి పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని పంచాయతీ ఈవో, ఎంపీడీవోలను ఆదేశించినట్లు తెలిపారు. పది రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం మరో రూ.1.28 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేశామని యార్లగడ్డ తెలిపారు.మంత్రి నారా లోకేష్ మంగళగిరిలో జీవో 30 ద్వారా పట్టాలు అందించిన తరహాలోనే గన్నవరంలో 500 మందికి, బాపులపాడులో 480 మందికి ఇళ్ల పట్టాలను పూర్తి చేశామని చెప్పారు. వారం రోజుల్లో అర్హులైన పేదలకు పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు.మల్లవల్లి పారిశ్రామిక ప్రాంతం రాబోయే రోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే బాపులపాడు, హనుమాన్జంక్షన్ ప్రాంతాల రూపురేఖలు మారతాయని ఎమ్మెల్యే అన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో అశోక్ లేలాండ్ ఛాసిస్ యూనిట్ మల్లవల్లికి రావడం ఖాయమైందని తెలిపారు. పరిశ్రమల రాకతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు విద్య, వైద్య రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయని యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆర్. మాధవన్తో ఉజ్జీవన్ ఎస్ఎఫ్బీ 'నథింగ్ స్మాల్ అబౌట్ అజ్' ప్రచారం

**గాంధీనగర్ సెప్టెంబర్ 18 మనం న్యూస్:** 'స్మాల్' అనే పదంపై కస్టమర్లలో ఉన్న అభిప్రాయాలను మార్చడంతో పాటు, తమ విస్తృత స్థాయి కార్యకలాపాలను తెలియజేసే ఉద్దేశంతో ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 'నథింగ్ స్మాల్ అబౌట్ అజ్' పేరుతో కొత్త బ్రాండ్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రముఖ నటుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆర్. మాధవన్ను ప్రచారకర్తగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 800కు పైగా శాఖల ద్వారా కోటికి పైగా కస్టమర్లకు బ్యాంక్ సేవలు అందిస్తోంది. సాధారణంగా 'స్మాల్' ఫైనాన్స్ బ్యాంక్ అంటే చిన్న ఆర్థిక అవసరాలకు మాత్రమే సేవలు అందిస్తుందని, పరిమిత స్థాయిలో బ్యాంకింగ్ ఉత్పత్తులు, కార్యకలాపాలు ఉంటాయని భావించే అవకాశం ఉందని, ఈ అభిప్రాయాన్ని మార్చడమే ప్రచార లక్ష్యమని సంస్థ తెలిపింది. సేవింగ్స్, డిపాజిట్లు, బిజినెస్ బ్యాంకింగ్, ఫారెక్స్, ఎన్నారై సేవలతో పాటు ఇన్వెస్ట్మెంట్, వెల్త్ సొల్యూషన్స్ను అందిస్తున్నట్లు పేర్కొంది. వివిధ వర్గాల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా రూ.6,000 నుంచి రూ.250 కోట్ల వరకు రుణ సదుపాయాలను అందిస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రచారంపై ఆర్. మాధవన్ మాట్లాడుతూ, ఉజ్జీవన్ కార్యకలాపాలు చిన్న స్థాయిలో లేవని, బ్యాంకు గురించి ప్రజలు మరింత తెలుసుకోవాల్సి ఉందన్నారు. టీవీ, ప్రింట్, డిజిటల్, ఓటీటీ, సీటీవీ, అవుట్డోర్, సోషల్ మీడియా, శాఖల ద్వారా ప్రచారం నిర్వహించనున్నారు.




# ఘనంగా జరిగిన ఎంపీ బాలశౌరి జన్మదిన వేడుకలు



**హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు**

**కేక్ కట్ చేసిన జనసేన, టీడీపీ నాయకులు**

**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 18 ( మనం న్యూస్):** మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి జన్మదిన వేడుకలు శుక్రవారం ఉదయం హనుమాన్ జంక్షన్ శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం వద్ద గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పార్లమెంట్ నియోజకవర్గ అభివద్ధికి అహర్నిశలు కషి చేస్తున్నారని అన్నారు. అలాగే కూటమి ప్రభుత్వ బలోపేతానికి, జనసేన పార్టీ అభివద్ధికి ఆయన చేస్తున్న సేవలు అభినందనీయం అని ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని అభయాంజనేయ స్వామిని కోరుకుంటున్నానని అన్నారు.దేవాలయంలో ముందుగా ప్రత్యేక పూజలు చేశారు.. అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,ఎం పి బాలశౌరీ కలసిఉన్న ఆరుఅడుగుల నిలువెత్తు చిత్ర పటాన్ని చలమలశెట్టి ఆవిష్కరించారు. అనంతరం దేవాలయం వద్ద జనసేన చిత్రపటం తో ఉన్న కేక్ ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం టౌన్ పార్టీ అధ్యక్షుడు లయన్ అట్లూరి శ్రీనివాస్, జనసేన నాయకులు అల్లాడశెట్టి నాగేశ్వరరావు. వడ్డి నాగేశ్వరరావు,షేక్ అహమ్మద్,వడ్డి రాము, వడ్డి అశోక్ కుమార్,తాడి శ్రీనివాసరావు,పూషదపు వీర వెంకయ్య,వడ్డి తరుణ్,వడ్డి శేఖర్,పవన్, వీర మహిళలు శింగవరపు సూర్యావతి, కొలసాని శివలీల, బండారు లక్ష్మీ ప్రసన్న, మద్దా జయరాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు



**ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ డీకే బాలాజి, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా**

**పామర్రు: సెప్టెంబరు 18,(మనం న్యూస్ ):** ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని, ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు. పామర్రు నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో శుక్రవారం పామర్రులో నియోజకవర్గస్థాయి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికఆరేపల్లి కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజాతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

**పామర్రు నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: శాసన సభ్యుడు వర్ల కుమార్ రాజా**

పామర్రు నియోజకవర్గ శాసన సభ్యుడు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి సత్వర పరిష్కారం చూపించడమే మీ కోసం కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నాలుగు వారాలుగా పామర్రు నియోజకవర్గాన్ని సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లా నుంచి మండల స్థాయి వరకు వివిధ శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరై పెండింగ్లో ఉన్న, క్లిష్టమైన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నారని చెప్పారు.'విజన్ పామర్రు'లో భాగంగా నియోజకవర్గ అభివృద్ధికి వివిధ శాఖలు, స్థానిక సంస్థల నిధులను సమన్వయం చేస్తున్నామని తెలిపారు. రాబోయే దసరా, సంక్రాంతిలోపు 'పల్లె పండుగ-3.0' ద్వారా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి సుమారు రూ.7 కోట్లు, శ్రీవాణి పథకం కింద 11 ఆలయాలకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు.సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పటివరకు నియోజకవర్గ ప్రజలకు సుమారు రూ.14 కోట్ల ఆర్థిక సహాయం అందించామని, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి ఎస్డిసి పి నీలకంఠేశ్వరరెడ్డి, ఉయ్యూరు ఆర్డిఓ ఎస్ కరుణ కుమారి, డివిజనల్ డెవలప్మెంట్ అధికారిని టి స్వర్ణలత, డీఎస్పీ పాల శ్రీనివాసరావు, పామర్రు, పెదపారుపూడి, పమిడిముక్కల, మొవ్వ, తోట్లవల్లూరు మండలాల తహసిల్దార్లు రవికాంత్, శ్రీను నాయక్, నవీన్ కుమార్, కే మస్తాన్, కుసుమకుమారి సంబంధిత శాఖల అధికారులు, డివిజన్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పంటల రక్షణకే 'సామూహిక ఎలుకల నిర్మూలన'

**గోడ పత్రికలను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తో కలిసి ఆవిష్కరించిన కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**పామర్రు, సెప్టెంబర్ 18 (మనం న్యూస్ ):** పంట కాలంలో ఎలుకల ఉధృతి వల్ల రైతులకు జరిగే నష్టాన్ని నివారించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న 'సామూహిక ఎలుకల నిర్మూలన' ప్రచార గోడ పత్రికలను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తో కలిసి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పామర్రు నిర్వహించిన పి జె ఆర్ ఎస్ కార్యక్రమంలో శుక్రవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాగు నీటి కాల్వలు, పంట పొలాల్లో ఏకకాలంలో గ్రామాల్లోని రైతులంతా కలిసి సామూహికంగా ఎలుకల నివారణ మందులు పెట్టాలని పిలుపునిచ్చారు. తద్వారా ఆశించిన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ గోడ పత్రికలను అన్ని గ్రామ సచివాలయాలు, రైతు సేవ కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు కే జ్యోతి రమణి, పామర్రు ఏ డి ఏ స్వర్ణలత, మండల వ్యవసాయ శాఖ అధికారిని వి శివ నాగరాణి, ఇతర జిల్లా డివిజన్ ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## మంటాడలో జాతీయ పోషణ్ అభియాన్ వేడుకలు



పామర్రు/ మంటాడ సెప్టెంబర్ 18(మనం న్యూస్ ): ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మంటాడ అంగన్వాడీ కేంద్రం-3 లో జాతీయ పోషణ్ అభియాన్ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు . అంగన్వాడీ కార్యకర్త ఎస్. రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో గర్భిణులు, బాలింతలకు పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. నిత్యం ఆకుకూరలు, తాజా కూరగాయలు, తృణధాన్యాలు తీసుకోవడం వల్ల రక్తహీనత వంటి సమస్యల నుండి దూరంగా ఉండవచ్చని రాజేశ్వరి పేర్కొన్నారు.

## సంచారా జాతుల వారిని ప్రభుత్వం ఆదుకోవాలి

వీరులపాడు సెప్టెంబర్ 18, మనం న్యూస్: ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సంచార జాతుల (యానాది, ఎరుకల తదితర తెగలు) జీవన పరిస్థితులపై ప్రభుత్వం ఆదుకోవాలని సంచార జాతులు విన్నవించుకుంటున్నారు ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలో ఆధునిక సమాజం రాకెట్ వేగంతో దూసుకుపోతున్నా, మండలంలో అల్లూరు జుజ్జూరు పెద్దాపురం వీరులపాడు గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న సంచార జాతుల బతుకులు మాత్రం ఇంకా అంధకారంలోనే మగ్గుతున్నాయి. జిల్లాలోని జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, మైలవరం నియోజకవర్గాలతో పాటు విజయవాడ నగర శివారు ప్రాంతాలలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న సంచార తెగలు (ముఖ్యంగా యానాది, ఎరుకల వంటి కులాలు) తో పాటు కులాల్లో పేదలు మైనారిటీలు నేటికీ కనీస మౌలిక వసతులకు నోచుకోక దుర్భర జీవనాన్ని సాగిస్తున్నారు.

**నిలువ నీడ లేని బతుకులు..**

**గుడారాలే శరణ్యం**

జిల్లాలోని గ్రామీణ, పట్టణ శివారు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు, కాలువ గట్లు, చెరువు పోరంబోకు భూముల్లో తాత్కాలిక గుడారాలు వేసుకుని వీరు నివసిస్తున్నారు. వర్షాకాలం వస్తే వీరి పడే ఇబ్బందులు వర్ణనాతీతం. ఎన్టీఆర్ జిల్లా ఎస్టీ కార్పొరేషన్ అధికారులు స్వచ్ఛంద సంస్థలతో కలిసి నిర్వహించిన డిజిటల్ సర్వే ప్రకారం, జిల్లాలోని దాదాపు 50కి పైగా గ్రామాల్లో సంచార జాతులైన యానాది జనాభా వివరాలను సేకరించారు. స్థిర నివాసం లేకపోవడం వల్ల వీరికి ఆధార్, రేషన్ కార్డులు, ఓటరు గుర్తింపు పత్రాలు పొందడం ఒక పెద్ద ప్రహసనంగా మారింది. వారి పిల్లలు విద్య కోసం పాఠశాలకు వెళ్లాలంటే వారి జీవన పరిస్థితి కోసం నిత్యం అనేక ప్రాంతాలు చేతివృత్తులు చేసుకొని జీవన సాగాల్సిన పరిస్థితిలో వారి కుటుంబాలు అందరిని నిరక్షరాశులుగా మిగులుతున్నారునిరక్షరాస్యత - ఉపాధి కరవుపూర్వీకుల నుంచి వస్తున్న సాంప్రదాయ వృత్తులైన ఈత చాపల అల్లిక, పక్షుల వేట, ఎలుకలు పట్టడం, పాత సామాన్లు సేకరించడం ద్వారానే వీరు జీవనోపాధి పొందుతున్నారు. అయితే కాలమార్పుతో ఈ వృత్తులు అంతరించిపోవడంతో రోజువారీ కూలీలుగా, చెత్త ఏరుకునే వారిగా మారిపోతున్నారు. సరైన ఆదాయం లేకపోవడం, నిరక్షరాస్యత కారణంగా వీరి పిల్లలు పాఠశాలలకు వెళ్లకుండా చిన్నతనంలోనే బాల కార్మికులుగా మారుతున్న పరిస్థితి జిల్లాలో స్పష్టంగా కనిపిస్తోంది.ఆశలు రేపుతున్న ప్రభుత్వ పునరావాస చర్యలు ఇటీవలి కాలంలో వీరి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కొన్ని ముందడుగులు వేసింది. నివాస వసతి: విజయవాడ నగర శివార్లలోని రాజరాజేశ్వరి పేటలో దాదాపు 86 సంచార కుటుంబాలకు గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లను కేటాయించారు. ఈ కాలనీల ద్వారా వారిని ఒకే చోట స్థిరపడేలా చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.ఆర్థిక తోడ్పాటు - డ్వాక్రా తరహా సంఘాలు: సంచార, విముక్తి జాతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. 10 నుంచి 20 మందితో డ్వాక్రా తరహా సంఘాలను ఏర్పాటు చేసి, వారికి ఉపాధి శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సంఘానికి ₹10,000 చొప్పున ఇవ్వడంతో పాటు, శిక్షణ అనంతరం ₹25,000 నుండి ₹1,00,000 వరకు 50 శాతం రాయితీతో ఉపాధి రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.తక్షణ అవసరాలు ప్రభుత్వాలు కాగితాలపై పథకాలు రచిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అర్హులందరికీ ఇవి చేరడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలోని సంచార జాతుల కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి కనీస మౌలిక వసతులు కల్పించడంతో పాటు, వారి పిల్లలకు ప్రత్యేక గురుకుల విద్యా సదుపాయాలు కల్పిస్తేనే వీరి జీవితాల్లో శాశ్వత మార్పు వస్తుందని సామాజిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంచార జాతుల హక్కులు-చట్టాలపై సంతాన జాతులకు అహ్వాన కార్యక్రమం నిర్వహించి ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ప్రభుత్వాలు కృషి చేయాలని సంచార జాతులు కోరుతున్నారు





## పుట్టగొడుగుల సాగుపై మహిళలకు శిక్షణ కార్యక్రమం

పామర్రు సెప్టెంబర్18 ( మనం న్యూస్) : ఉద్యాన శాఖ మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) సమన్వయంతో, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల వారి సాంకేతిక సహకారంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు పుట్టగొడుగుల పెంపకం మరియు స్వయం ఉపాధి అవకాశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె. జ్యోతి మాట్లాడుతూ, పుట్టగొడుగులు అధిక పోషక విలువలు కలిగిన ఆరోగ్యకరమైన ఆహారమని, వీటిని నిత్యాహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆదాయాన్ని కూడా పెంపొందించుకోవచ్చని తెలిపారు. మహిళలు పుట్టగొడుగుల సాగును స్వయం ఉపాధి సాధనంగా మలుచుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే అవకాశమున్న ఈ పరిశ్రమకు మార్కెటింగ్ పరంగా మంచి అవకాశాలు ఉన్నాయని, రెసిలియెంట్ అగ్రి టెక్ ఫార్మ్ ద్వారా కొనుగోలు ఒప్పందం సదుపాయం కల్పించబడుతోందని వివరించారు. అలాగే ఉద్యాన శాఖ అమలు చేస్తున్న సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా పుట్టగొడుగుల ఉత్పత్తి యూనిట్ల స్థాపనకు 40 నుండి 50 శాతం వరకు సబ్సిడీ అందజేయబడుతోందని తెలిపారు. శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం, ప్రభుత్వ ప్రోత్సాహకాలతో మహిళలు ఈ రంగంలో స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మరియు డైరెక్టర్ డా. సుధారాణి మాట్లాడుతూ, పుట్టగొడుగుల సాగు గ్రామీణ మహిళలకు ఉత్తమ స్వయం ఉపాధి అవకాశమని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధిని విస్తరించుకోవాలని సూచించారు. కల్తీ లేని, అధిక పోషక విలువలు కలిగిన ఆహారంగా పుట్టగొడుగులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. గృహ విజ్ఞాన శాస్త్రం ఇన్ఛార్జి శాస్త్రవేత్త మరియు సస్యరక్షణ విభాగం సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్ డా. కె. రేవతి, పుట్టగొడుగుల సాగుకు అవసరమైన ముడి పదార్థాల ఎంపిక, బెడ్ తయారీ, స్పానింగ్, నిర్వహణ, పంట కోత, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్యాకింగ్ మరియు మార్కెటింగ్ వరకు పూర్తి స్థాయిలో సాంకేతిక శిక్షణ అందించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ



(డీఆర్డీఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ బి. హరిహరనాథ్ మాట్లాడుతూ, పుట్టగొడుగుల సాగు మహిళలకు తక్కువ పెట్టుబడితో ప్రారంభించగల లాభదాయక స్వయం ఉపాధి పరిశ్రమ అని తెలిపారు. డీఆర్డీఏ ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు, ప్రభుత్వ సహాయ పథకాల గురించి వివరించి, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డివిజనల్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ మధు, పామర్రు ఉద్యాన అధికారి జె. కీర్తి దేవ్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ తిరుపతయ్య, రెసిలియెంట్ అగ్రి టెక్ వ్యవస్థాపకులు శ్రీ ఆర్.వి.ఎల్. మనోహర్, శ్రీమతి డి. సాయి సుధ, సీసీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు మరియు ఆసక్తి గల మహిళలు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఊరేగింపులపై పోలీసుల సూచనలు



వీరులపాడు సెప్టెంబర్ 18, మనం న్యూస్: వీరులపాడు పోలీస్ స్టేషన్ లో శుక్రవారం రోజున ఎస్ ఐ మండల గణేష్ మండపాల కమిటీలతో సమావేశం నిర్వహించడం జరిగింది.రాబోయే శని, ఆదివారాల్లో నిర్వహించనున్న గణేష్ నిమజ్జన ఊరేగింపుల నేపథ్యంలో, వీరులపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, శాంతిభద్రతలు, ప్రజల భద్రత మరియు ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా పాటించవలసిన నియమ నిబంధనలను స్పష్టంగా తెలియజేయడం జరిగింది.

**నిమజ్జన ఊరేగింపులు**

**నిర్వహించే కమిటీలు**

**తప్పనిసరిగా కింది సూచనలు**

**పాటించాలి...**

ప్రతి గణేష్ మండపం వద్ద ఇఇ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసి, అవి పనిచేసే స్థితిలో ఉండేలా చూసుకోవాలి. నిమజ్జన ఊరేగింపులు పోలీసులు ముందుగా నిర్దేశించిన రూట్లలో మాత్రమే నిర్వహించాలి. పోలీసుల అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ రూట్ మార్చరాదు. ప్రజల భద్రత మరియు సాధారణ ట్రాఫిక్కు దృష్టిలో ఉంచుకొని రోడ్లపై ట్రాఫిక్కు అంతరాయం కలిగించరాదు. అంబులెన్సు మరియు ఇతర అత్యవసర వాహనాలకు తప్పనిసరిగా దారి ఇవ్వాలి. నిమజ్జన ఊరేగింపులను క్రమశిక్షణతో నిర్వహించి రాత్రి 10:00 గంటలలోపు పూర్తి చేయాలి.వినియోగం, రాజకీయ పాటలు, రెచ్చగొట్టే/వివాదాస్పద పాటలు, నినాదాలు లేదా ఇటౌరౌఛ్బిజీర్ఛ్ ఛీజ్బిజూౌజ్ఛుటకు అనుమతి లేదు. మతాలు, కులాలు, వర్గాలు లేదా వ్యక్తుల మధ్య విద్వేషం/ఉద్రిక్తతలకు దారితీసే విధంగా పాటలు, ప్రసంగాలు, డైలాగులు లేదా నినాదాలు వినిపించరాదు. పై నిబంధనలను ఉల్లంఘించి ృఒలను వినియోగించినా, రాజకీయ లేదా రెచ్చగొట్టే పాటలు/డైలాగులు ప్రసారం చేసినా, సంబంధిత వ్యక్తులు మరియు నిర్వాహకులపై వర్తించే చట్ట నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, చట్ట ప్రకారం ృఒ సౌండ్ సిస్టమ్/పరికరాలపై అవసరమైన చర్యలు తీసుకోబడతాయి. ఊరేగింపు సమయంలో మద్యం సేవించడం, గొడవలు సృష్టించడం, ఇతరులను రెచ్చగొట్టడం లేదా ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలకు పాల్పడరాదు. ప్రతి కమిటీ తమ వాలంటీర్లను ఏర్పాటు చేసుకొని, ఊరేగింపు ప్రారంభం నుండి నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీసులకు సహకరించాలి. నిమజ్జన ప్రదేశాల్లో చిన్నపిల్లలు మరియు ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

**భక్తితో గణనాథుడిని**

**సాగనంపుదాం - క్రమశిక్షణతో**

**నిమజ్జనం నిర్వహిద్దాం...**

గణేష్ ఉత్సవ కమిటీలు, యువత మరియు ప్రజలు పోలీసు శాఖకు పూర్తిగా సహకరించి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలని వీరులపాడు పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రహదారుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక ఎమ్మెల్యే వసంత



**పూరగుట్టలో రూ.40 లక్షలతో అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన**

**మౌలిక వసతుల కల్పన కు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత**

మైలవరం సెప్టెంబర్ 18 మనం న్యూస్ : స్థానిక శివారు పూరగుట్టలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే దిశగా మరో ముందడుగు పడింది. పూరుగుట్టలో డి.ఎం.ఎఫ్ నిధులు రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రహదారుల నిర్మాణ పనులకు శాసన సభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు మాట్లాడుతూ.. పూరగుట్ట లో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు నిత్య జీవితంలో ఇబ్బందులు లేకుండా రహదారులు తదితర మౌలిక సదు పాయాలను దశల వారీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా మని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు భోజనం, 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, దీపం-2.0, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు ఆర్థిక సహాయం వంటి అనేక సంక్షేమ కార్య క్రమాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంద ని వసంత వెంకట కృష్ణ ప్రసాదు పేర్కొన్నారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించుకుని ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు తెలిపారు. నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాల్లో అవసరమైన రహదారు లను గుర్తించి దశలవారీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా మని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చి పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. పూరగుట్టలో అంతర్గత రహదారుల నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలగడంతో పాటు ప్రాంతంలో మౌలిక వసతులు మెరుగుపడను న్నాయని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు తెలిపారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ లేకుండా, నిర్దేశిత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బుడమేరు వాగుపై వంతెన నిర్మాణానికి శ్రీకారం



**శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వసంత**

**దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బంది లకు పరిష్కారం**

**రూ.75 లక్షల వ్యయంతో వంతెన నిర్మాణం**

**రైతుల రాకపోకలు, పంటల రవాణాకు ఇక సౌకర్యం**

మైలవరం సెప్టెంబర్ 18 మనం న్యూస్ :స్థానిక పట్టణంలోని నారాయణనగర్ ప్రాంతంలో బుడమేరు వాగుపై రైతుల చిరకాల సమస్యకు పరిష్కారం లభించనుంది. దశాబ్దాలుగా వర్షాకాలంలో బుడమేరు వాగును దాటి అవతలి వైపున ఉన్న తమ పొలాలకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో డి.ఎం.ఎఫ్ నిధులు రూ.75 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న లోలెవెల్ వంతెనకు శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. నారాయణనగర్ ప్రాంతం నుంచి ప్రవహించే బుడమేరు వాగు కారణంగా ప్రతి ఏటా వర్షాకాలంలో రైతుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. వాగులో వరద ప్రవాహం పెరిగిన సమయంలో అవతలి వైపున ఉన్న వ్యవసాయ భూములకు వెళ్లడం, పంటలను తరలించడం రైతులకు పెద్ద సవాలుగా మారేది. గతంలో వరదలను నియంత్రించేం దుకు నిర్మించిన చెక్డ్యాం సైతం దెబ్బతినడంతో సమస్య మరింత తీవ్ర మైంది. ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు చాలాకాలంగా విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు వంతెన నిర్మాణా నికి ప్రత్యేక చొరవ చూపారు. ఈ క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి, రూ.75 లక్షల నిధులతో లోలెవెల్ వంతెన నిర్మాణా నికి అనుమతులు తీసుకు వచ్చారు. ప్రస్తుతం వాగులో నీటి ప్రవాహం లేని పరిస్థితి ఉండటంతో పనులను వేగం గా ప్రారంభించి, సాధ్యమై నంత త్వరగా పూర్తి చేయా లని అధికారులు, సంబంధిత సిబ్బందికి సూచించారు. వంతెన నిర్మాణం పూర్తయితే నారాయణనగర్ పరిసర ప్రాంతాల్లోని వందలాది ఎకరాల వ్యవసాయ భూములకు వెళ్లేందుకు రైతులకు రాకపోకల సౌకర్యం మెరుగుపడటంతో పాటు, పంటల రవాణా కూడా సులభతరం కానుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు మాట్లాడుతూ, రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతుల ప్రయోజ నాలు, వ్యవసాయాభివృద్ధి కి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. వంతెన నిర్మాణం పూర్తయి న తర్వాత రైతుల రాక పోకలు, పంటల రవాణాలో ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. దీంతో నారాయణనగర్ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు వాకింగ్ ట్రాక్‌ను సద్వినియోగం చేసు కోవాలి

**దేవుని చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ ప్రారంభం**

**వ్యాయామంతో ఆరోగ్యానికి ఎంతో మేలు**

**ఎమ్మెల్యే వసంత**

మైలవరం సెప్టెంబర్ 18 మనం న్యూస్ :స్థానిక పట్టణంలోని సూరిబాబు నగర్ లో దేవుని చెరువు కట్టపై రూ.50 లక్షలతో నిర్మించిన వాకింగ్ ట్రాక్ను శాసన సభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే ఉద్దేశంతో దేవుని చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ను ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. చెరువు కట్టపై ఆహ్లాద కరమైన వాతావర ణంలో ప్రతిరోజూ వాకింగ్, వ్యాయామం చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో కొంత సమయా న్ని వ్యాయామానికి కేటా యించాలని సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకో వచ్చని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ వాకింగ్ ట్రాక్ను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించు కోవాలని ఎమ్మెల్యే కోరారు. కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలకు ప్రాధాన్యత నిస్తూ నియోజకవర్గంలో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోం దని వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు. అదే విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నా మని చెప్పారు. మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను



మెరుగుపరిచే కార్యక్రమా లకు ప్రాధాన్యత ఇస్తున్నా మని పేర్కొన్నారు. దేవుని చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి రావడం తో స్థానిక ప్రజలు, వృద్ధులు, యువత, మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు మిగులు సరుకు కొనుగోలు చేయాలి

**ఎఫ్సీవీ రైతులకు రూ.50వేల సాయం అందించాలి**

**పొగాకు బోర్డు ఈడీకి రైతు సంఘాల వినతి**



గుంటూరు: సెప్టెంబర్ 18 (మనం న్యూస్ ప్రతినిధి) వర్జీనియా పొగాకు రైతుల మిగిలిన సరుకును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం భారత పొగాకు బోర్డు కార్యనిర్వాహక సంచాలకులు విశ్వశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది సుమారు 30 శాతం ఎఫ్సీవీ పొగాకు రైతులు తక్కువ ధరలకు తమ ఉత్పత్తులను విక్రయించుకోవాల్సి వస్తోందని తెలిపారు. మిగిలిన పొగాకును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.50 వేల ఆర్థిక సాయాన్ని వాస్తవ సాగుదారులైన ఎఫ్సీవీ రైతులకు ఉచితంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని ఈడీని కోరారు. రైతు సంఘాల వినతిపై ఈడీ స్పందిస్తూ సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాసినట్లు తెలిపారు.కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ చుండూరి రంగారావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డె హనుమారెడ్డి,ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ జగన్నాథం,రైతు కూలీ సంఘం నాయకులు పరిటాల కోటేశ్వరరావు, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కె.హనుమంతరావు, కనపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురంలో ఘనంగా అన్నదానం



వీరులపాడు సెప్టెంబర్ 18, మనం న్యూస్: వీరుల పాడు మండలం లోని పెద్దాపురం గ్రామంలో ఆవుల రమేష్ వారి యూత్, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా వినాయక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టి నారు. గతనాలుగు రోజులు గా గ్రామంలో అన్నదాన కార్యక్రమం చేపట్టినారు. నేడు అన్నదాన కార్యక్రమం ఆవుల సుబ్బారావు, రామ సీత లు దగ్గర ఉండి అన్నదానం చెయ్యటం విశేషం. ప్రతి సంవత్సరం వినాయక పండుగ మహోత్సవం ను ఆవుల యూత్, కుటుంబ సభ్యులు ఎంతో భక్తి శ్రద్ధ తో పాటు గ్రామంలో అందరు అన్నదానం గావిస్తున్నారు.

## మీనా సుకన్య స్టూడియోను సందర్శించిన

# ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 18 ( మనం న్యూస్):**ప్రభుత్వ విప్,గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హనుమాన్ జంక్షన్ లోని మీనా సుకన్య ఫోటో స్టూడియోని సందర్శించారు. హనుమాన్ నగర్ ప్రధాన రహదారిని 21.50 లక్షల రూపాయలతో అభివృద్ధి చేశారు. దీనిని ప్రారంభించిన యార్లగడ్డ లయన్స్ క్లబ్ నాయకుడు, స్టూడియో అధినేత కళ్లేపల్లి నారాయణరావు ఆహ్వానం మేరకు స్టూడియోకి వచ్చారు.కొన్ని దశాబ్దాలుగా స్టూడియో నిర్వహిస్తూ, ఉత్తమమైన ఫోటోగ్రాఫర్ గా నారాయణరావు గుర్తింపు పొందారని కొనియాడారు. లయన్స్ నాయకులు, సీనియర్ జర్నలిస్టులు తాడి రంగారావు, మేడేపూడి రాజా, రొంపల్లి అచ్యుతరావు, తెలుగుదేశం టౌన్ పార్టీ అధ్యక్షులు లయన్ అట్లూరి శ్రీనివాస్, లయన్ తమిరి రమేష్, లయన్ అక్కినేని రాఘవేంద్రరావు, సీనియర్ ఫోటోగ్రాఫర్ అంబళ్ళ వెంకట రంగారావు పాల్గొన్నారు.

# కిమ్స్ చక్ర క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ద్వితీయ వినాయక చవితి సంబరాలు



**గుంటూరు తక్కెళ్ళపాడు సెప్టెంబర్ :18 (మనం న్యూస్ ప్రతినిధి )**కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ద్వితీయ వినాయక చవితి సంబరాలు ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా శుక్రవారం సెప్టెంబర్ 18 తేదీ తక్కెళ్ళపాడు గ్రామంలో కిమ్స్ చక్ర క్యాన్సర్ హాస్పిటల్ నందు భక్తులకు అన్న వితరణ కార్యక్రమంలో డాక్టర్ రాము కందుల,డా.టి మహతి,డా.పి. శ్రీఫణి,డా. యు.సుమన్, కన్సల్టింగ్ డాక్టర్స్ , హాస్పటల్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రాము కందుల మాట్లాడుతూ.రెండు సంవత్సరాల నుండి వినాయక చవితి పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని. ప్రతిరోజు భక్తిశ్రద్ధలతో వినాయకుని పూజ కార్యక్రమాలు వేద పండితుల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.అలాగే కిమ్స్ చక్ర క్యాన్సర్, హాస్పిటల్ తరఫున వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి క్యాన్సర్ గురించి ప్రతి పల్లెలో ఉన్న ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని.అదేవిధంగా ప్లాస్టరా ప్యారిస్ వంటి వినాయక విగ్రహాలను నిషేధించి వాటి వలన కలిగే దుష్ప్రభావాలు నుండి ప్రజలు దూరంగా ఉండాలని.మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించావలసిందిగా కోరారు,రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పలు వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు,అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు పశ్చిమ సెప్టెంబర్: 18 (మనం న్యూస్ ప్రతినిధి)** నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి శుక్రవారం నియోజకవర్గంలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులతో కలిసి శ్రీ వినాయక స్వామివారిని దర్శించుకుని ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ,సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు. అలాగే వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు.తొలుత 38వ డివిజన్ రాజేంద్రనగర్ మెయిన్ రోడ్డులో గణేష్ ఉత్సవ కమిటీ మరియు నందమూరి యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 43వ డివిజన్ విద్యానగర్ జీరో లైన్లో రావి రామచంద్రరావు మరియు విద్యానగర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా 43వ డివిజన్లోని సాయిబాబా రోడ్ నార్నీ టవర్స్ సెంటర్ వద్ద గణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదాన సేవ అందిస్తున్న యువతను అభినందించారు.అనంతరం 32వ డివిజన్ బ్రాడీపేట 6/18 ప్రాంతంలో బ్రాడీపేట ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి అన్నదాన కార్యక్రమానికి హాజరై నిర్వాహకులతో కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.25వ డివిజన్ శ్రీ లక్ష్మీనగర్ 1/6వ లైన్లో శ్రీ సిద్ధి వినాయక ఫ్రెండ్ సర్కిల్,అధ్యక్షులు గాలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ,వినాయక చవితి ఉత్సవాలు భక్తి, ఐకమత్యం,సామాజిక సేవకు ప్రతీకలని అన్నారు.యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానాలు,సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు.



# హృదయ స్పందనలకు 'యశోద హైటెక్ సిటీ' మహా సంజీవని




**▸▸ డాక్టర్ భీష్మ చౌదరి దొనేపూడి సారథ్యంలో బెజవాడలో కోతలు లేని వైద్యం అందుబాటులోకి**

**గాంధీనగర్ సెప్టెంబర్ 18 మనం న్యూస్:** కార్డియాలజీ విభాగంలో నూతన శకానికి నాంది పలుకుతూ, ప్రాణాపాయంలో ఉన్న గుండె బాధితులను రక్షించేందుకు హైదరాబాద్లోని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ ముందడుగు వేసింది. వైద్య వృత్తిలో అపార అనుభవం గడించిన ప్రముఖ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ భీష్మ చౌదరి దొనేపూడి స్వతహాగా విజయవాడ వాస్తవ్యుడు. తన మాతృభూమి రుణాన్ని తీర్చుకోవాలనే సదుద్దేశంతో, స్థానిక ప్రజలకు అత్యున్నత స్థాయి గుండె చికిత్సలను చేరువ చేయాలని ఆయన సంకల్పించారు. ఈ సందర్భంగా విజయవాడ జిఆర్టి గ్రాండ్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగరవాసులకు నూతనంగా అందుబాటులోకి వచ్చిన అధునాతన వైద్య సాంకేతికతను ఆయన ఆవిష్కరించారు. స్థానిక ఆసుపత్రుల్లో నయం చేయడం అసాధ్యమని భావించే అత్యంత విషమ కేసులకు సైతం యశోద హైటెక్ సిటీ ఒక ప్రాణదాతగా వ్యవహరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కోస్తా జిల్లాల రోగులను అత్యవసర సమయాల్లో నిమిషాల వ్యవధిలోనే ఆసుపత్రికి తరలించి, తక్షణమే వైద్యం ప్రారంభించేలా ఒక కచ్చితమైన ప్రాణరక్షక ప్రోటోకాల్ను సిద్ధం చేసినట్లు వివరించారు. పాతకాలపు ఓపెన్ హార్ట్ సర్జరీలకు ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం యశోద హైటెక్ సిటీలో కోతలు లేని అద్భుతమైన శస్త్రచికిత్సలు రోగులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో వాల్వ్ సమస్యలతో బాధపడేవారికి ఛాతీని చీల్చకుండా కేవలం క్యాథెటర్ సాయంతో నేరుగా కవాటాలను మార్చే ట్యావర్, మిత్రాక్లిప్ విధానాలు ప్రాణదానం చేస్తున్నాయని తెలిపారు. నూరు శాతం క్యాల్షియం పేరుకుపోయి రక్తనాళాలు మూసుకుపోయిన అత్యంత జటిలమైన సమస్యలకు సైతం బైపాస్ అవసరం లేకుండానే డాక్టర్ భీష్మ చౌదరి దొనేపూడి నేతృత్వంలోని బృందం సునాయాసంగా చికిత్స అందిస్తోంది. రక్తనాళాల్లో జీవితాంతం ఉండిపోయే లోహపు స్టెంట్లకు బదులుగా, ఔషధం పూసిన బెలూన్లతో బ్లాకులను నిర్మూలించే సరికొత్త స్టెంట్ లెస్ టెక్నాలజీ బాధితులకు ఊరటనిస్తోంది. దీనికి తోడు పెద్ద కోతలు లేకుండా అతిచిన్న రంధ్రాల సాయంతో కీహోల్ పద్ధతిలో గుండెకు రోబోటిక్ బైపాస్ సర్జరీలను అత్యంత కచ్చితత్వంతో నిర్వహిస్తున్నారు. సంక్లిష్టమైన యాంజియోప్లాస్టీ సమయంలో గుండె సామర్థ్యం పడిపోయినప్పుడు వెన్నుదన్నుగా నిలిచే ప్రపంచంలోనే అతిచిన్న హార్ట్ పంప్ ఇంపెల్లా సాంకేతికతను ఇక్కడ విస్తృతస్థాయిలో వినియోగిస్తున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ ఏపీ మార్కెటింగ్ హెడ్ జి.సంతోష్ కుమార్ శర్మ, మేనేజర్ కె.చంద్రశేఖర్ శర్మ, ఎగ్జిక్యూటివ్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎవరో వస్తే గాని కేసు నమోదు చేయను అని చెప్పారు అంటూ

**▸▸ బాధితురాలి తరపున నేనే వచ్చా కేసు నమోదు చేయండి**

**▸▸ బాధితురాలితో కలిసి స్వయంగా పోలీస్ స్టేషన్ కు వెళ్లిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**▸▸ ప్రజా గ్రీవెన్స్‌లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు పశ్చిమ, సెప్టెంబర్ 18 (మనం న్యూస్ ప్రతినిధి):** నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు.ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ గ్రీవెన్సులో గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన రిజ్వానా అనే మహిళ కన్నీటి పర్యంతమై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ని కలిసి తన గోడును వినిపించారు.'అక్కా..నన్ను కాపాడండి. నాకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.నా భర్త మద్యం తాగి తరచూ వేధిస్తున్నాడు. కత్తి పట్టుకుని బెదిరిస్తున్నాడు. మమ్మల్ని ప్రశాంతంగా బ్రతకనివ్వడం లేదు.అని ఇప్పటికే తన భర్తపై పోక్సో కేసు నమోదై ఉన్నప్పటికీ, వేధింపులు మాత్రం ఆగడం లేదని,తనకు మరియు తన పిల్లలకు రక్షణ కల్పించాలని ఆమె వేడుకున్నారు. బాధితురాలి ఆవేదనను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు వెంటనే స్పందించారు. ఈ నెల 17వ తేదీన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.అయితే బాధితురాలు పోలీస్ స్టేషన్కు వెళ్తే 'ఎవరినైనా తీసుకొని వేస్తే, కేసు నమోదు చేస్తామని' చెప్పి నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి దృష్టికి తీసుకొచ్చారు.సాధారణంగా ఒక ప్రజాప్రతినిధి ఫోన్ చేసి అధికారులతో మాట్లాడవచ్చు.సూచనలు ఇవ్వవచ్చు.కానీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు మాత్రం అక్కడితో ఆగలేదు. బాధితురాలి పరిస్థితిని అర్థం చేసుకుని ఆమెను స్వయంగా తన వాహనంలో తీసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్కు వెళ్లారు.అక్కడ పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడుతూ.ఎవరో వస్తే గాని కేసు నమోదు చేయను అని చెప్పారు అంటా, బాధితురాలి తరపున నేనే వచ్చా కేసు నమోదు చేయండి అని పోలీసుల ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరడంతో.పోలీసులు నిర్ఘాంత పోయారు. బాధితురాలికి న్యాయం జరిగేలా, భద్రత కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. గృహహింస, వేధింపులు లేదా బెదిరింపులు ఎదుర్కొంటున్న మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన బాధ్యత అని,బాధలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలబడటమే ప్రజాప్రతినిధిగా తన కర్తవ్యమని తెలిపారు.



## ఘనంగా మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పుట్టినరోజు వేడుకలు



గుంటూరు పెద్దకూరపాడు సెప్టెంబర్ :18 (మనం న్యూస్ ప్రతినిధి )వై యస్ ఆర్ సీపీ నాయకులు, అభిమానుల మధ్య ఆనందంగా కేక్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్యే .పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం క్రోసూరు లోని వై యస్ ఆర్ సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా జరిగాయి. వేడుకలకు పల్నాడు జిల్లా వై యస్ ఆర్ సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గుంటూరు వైయస్సార్సీపి నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా,తాడికొండ నియోజకవర్గం వై యస్ ఆర్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్ర బాబు (డైమండ్ బాబు ),జీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు (లాలుపురం) పాల్గొని. నంబూరు శంకరరావు కి శుభాకాంక్షలు తెలియజేసారు. ముందుగా క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్ లోని దివంగత నేత శ్రీ వై యస్ రాజశేఖరరెడ్డి, విగ్రహానికి నంబూరు శంకరరావు నివాళులు అర్పించారు. అనంతరం సెంటర్ లో స్టూడెంట్ వింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గజమాలను క్రెన్ సహాయంతో నంబూరు శంకరరావు కి సత్కరించారు.తదనంతరం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకున్న మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు కి, నియోజకవర్గంలోని అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని, శాలువాలతో సత్కారించి, పుష్ప గుచ్చాలు అందజేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.

## ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో సేవా కార్యక్రమాలు




**జగ్గయ్యపేట: సెప్టెంబర్ 18 మనం న్యూస్:** దేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని జగ్గయ్యపేట పట్టణ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రధాని మోదీ సేవే సంకల్పం - దేశమే ప్రథమం అనే స్ఫూర్తితో ప్రజాసేవా కార్యక్రమాల్లో భాగంగా జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద బీజేపీ పార్టీ జెండా దిమ్మె నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మరింత చేరువ కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జనరల్ సెక్రెటరీ బీజేపీ అన్నే పాగా ప్రపుల్ల శ్రీకాంత్ మరియు ఎన్టీఆర్ జిల్లా సీనియర్ నాయకులు జిల్లా కోర్ కమిటీ మెంబర్ కీసర రాంబాబు , జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడు రాజా , పట్టణ ప్రధాన కార్యదర్శి కంబాల గోపి , బీజేవైఎం ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కీసర గోపి , ఓబీసీ అధ్యక్షులు అన్నవరపు వెంకటేష్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి గోపి సుభాష్ చంద్రబోస్ ,ఉపాధ్యక్షులు దుర్గా మణికంఠ , సీనియర్ నాయకులు పసుపులేటి శ్రీకృష్ణ ,వేద సుబ్రహ్మణ్యం,వెంకటేశ్వరరావు కాసిన కృష్ణ , పైసాని కృష్ణ , యశస్విని ,వాసవి మండల యువమోర్చా అధ్యక్షులు అన్నవరపు ఏడుకొండలు, నాయకులు, కార్యకర్తలు, వివిధ మోర్చాల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో వైఎస్ఆర్ సీ పీ జెండా ఎగరాలి



▸▸ **ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి**

▸▸ **జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు**

**వత్సవాయి సెప్టెంబర్ 18 మనం న్యూస్:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి గ్రామంలోనూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు పిలుపు ఇచ్చారు. జగ్గయ్యపేట నియోజకవర్గం వత్సవాయి మండలం వత్సవాయి గ్రామంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకర్రావు అధ్యక్షతన మండల స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడమే ధ్యేయంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల మధ్య చర్చించాలని, అదే సమయంలో నాటి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గత పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య ఉన్న విధానపరమైన తేడాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున అభ్యర్థులు పోటీ చేసేలా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సన్నాహాలు ప్రారంభించాలని సూచించారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలాన్ని చాటాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

గత కొంతకాలంగా గిట్టుబాటు ధరలు, వర్షాభావ పరిస్థితులు, పంటలకు సంబంధించిన సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వం మరియు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బలంగా నిలబెట్టి పార్టీ సత్తాను చాటేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాలను పూర్తి చేసి, సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు అందజేస్తామని తెలిపారు. పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని కార్యకర్తలందరికీ ఒక పండుగలా నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ, మండల పార్టీ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది సంక్షేమమే శాఖ ప్రాధాన్యం



▸▸ **ప్రతి సమస్యకు నిబంధనల మేరకు త్వరిత పరిష్కారం**

▸▸ **జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్**

**గుంటూరు సెప్టెంబర్18 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే 'పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే కార్యక్రమంలో శుక్రవారం 18.09.2026 న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ పాల్గొని, జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నుండి వ్యక్తిగత,సేవా సంబంధిత సమస్యలు, బదిలీలు,పదోన్నతులు, సెలవులు,వైద్య అవసరాలు మరియు ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి వినతిని జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి,శాఖ నిబంధనలకు అనుగుణంగా వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.సిబ్బంది సమస్యలు సకాలంలో పరిష్కారమైతే విధి నిర్వహణలో మరింత సామర్థ్యం,నిబద్ధత, ఉత్సాహం పెరుగుతాయని పేర్కొన్నారు. బదిలీలు, పదోన్నతులు,ఇతర పరిపాలనా నిర్ణయాలు శాఖ నిబంధనలు,ఖాళీలు, పరిపాలనా అవసరాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా చేపడతామని స్పష్టం చేశారు.పోలీస్ సిబ్బంది ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించిన ఎస్పీ,సిబ్బంది సంక్షేమం మెరుగుపడితేనే ప్రజలకు మరింత సమర్థవంతమైన,డ నాణ్యమైన పోలీసు సేవలు అందించగల మన్నారు. అదేవిధంగా ప్రతి పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, అంకితభావంతో వ్యవహరించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం,భద్రతాభావం మరింత పెంపొందేలా సేవలందించాలని సూచించారు .'పోలీస్ శాఖ ఒక కుటుంబం. పరస్పర సహకారం,సమన్వయం, పరస్పర గౌరవంతో పనిచేసినప్పుడే సంస్థ మరింత బలోపేతం అవుతుంది.పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది' అని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

▸▸ **ఎమ్మెల్యే డా.బూర్ల రామాంజనేయులు**

**గుంటూరు సెప్టెంబర్ :18 (మనం న్యూస్ ప్రతినిధి):** ప్రతి శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆదేశాల మేరకు గుంటూరులోని ప్రత్తిపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించిన ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు.ఈ సందర్భంగా ప్రజల నుండి ఫిర్యాదులను, వినతులను స్వీకరించారు. అందిన ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి,తక్షణమే పరిష్కరించా ల్సిన వాటికి అక్కడికక్కడే పరిష్కార మార్గాన్ని సూచించారు. మరికొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి పరిష్కారం చూపాలని ఆదేశించారు.ఇతర శాఖలకు సంబంధించిన ఫిర్యాదుల నిమిత్తం అవసరమైన పి జి ఆర్ ఎస్ నమోదు చేయమని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తోంద న్నారు.ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్న ప్రతి సమస్యను తక్షణ పరిష్కారానికి కృషి చేస్తున్నామని,ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఈ ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని, దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న పత్తిపాడు ఎమ్మెల్యే



**గుంటూరు పత్తిపాడు సెప్టెంబర్ 18 (మనం ప్రతినిధి):** వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా,వట్టిచెరుకూరు మండలం,కొర్నెపాడు గ్రామంలో బాలగణేష్ యూత్ నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డా.బూర్ల రామాంజనేయులు.అనంతరం బాలగణేష్ యూత్ నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు, విద్యార్థులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు.భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమా లను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాల గణేష్ యూత్ గ్రామ పెద్దలు,యువత,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్వచ్ఛత పాఠశాల పై అవగాహన





**విజయవాడ,సెప్టెంబర్,18,(మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో భాగంగా పటమటలోని కేవీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పిస్తూ, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్-2026 ప్రకారం నాలుగు రకాల చెత్తబుట్టలను ఎలా వినియోగించాలి, ఏ రకమైన వ్యర్థాలను ఏ చెత్తబుట్టలో వేయాలి అనే అంశాలను వివరించారు. విద్యార్థుల్లో స్వచ్ఛతపై అవగాహనను మరింత పెంపొందించే విధంగా వివిధ పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో బాధ్యతా భావాన్ని పెంపొందించేందుకు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. విద్యార్థులచే మొక్కలు నాటించి, వాటి సంరక్షణ, పచ్చదనం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, జోనల్ కమిషనర్ కె. షమ్మీ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

# వియంసి పారిశుధ్య కార్మికులకు శిక్షణ

- **వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రతపై అవగాహన**



**విజయవాడ,సెప్టెంబర్, 18,(మనం న్యూస్):** విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో, వాష్ ఇనిష్యూట్ సాంకేతిక సహకారంతో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ (విసిఎఫ్) , స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ (యస్ఏసి), ఆధ్వర్యంలో విజయవాడ నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు సామర్థ్య నిర్మాణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెప్టెంబర్ 18, 2026న విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నిర్మలా గ్లోరీ, ఎఎంఓహెచ్ డాక్టర్ గోపాల్ నాయక్, డాక్టర్ అన్నపూర్ణతో పాటు సర్కిల్-1 శానిటరీ సూపర్వైజర్లు హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీహెచ్ నిర్మలా గ్లోరీ పారిశుధ్య కార్మికులకు వివిధ రకాల వ్యర్థాలను వేర్వేరు రంగుల బిన్లలో ఎలా వేరు చేయాలి, ఆయా బిన్లను ఏ విధంగా వినియోగించాలి అనే అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్-1కు చెందిన 150 పారిశుధ్య కార్మికులకు వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రత, వ్యక్తిగత రక్షణ పరికరాల (ప్పఉ) వినియోగం, సంక్షేమంపై ప్రత్యేకంగా శిక్షణ అందించారు. పారిశుధ్య పనుల్లో ఎదురయ్యే ఆరోగ్య ప్రమాదాలు, సురక్షిత పరిశుభ్రత పద్ధతులు, పిపిఎఫ్ అవసరం, వివిధ రకాలు, వాటి నిర్వహణ, సరైన విధంగా ధరించడం మరియు తొలగించడం వంటి అంశాలను శిక్షణలో వివరించారు. అదేవిధంగా యాంత్రిక మలబురద తొలగింపు , ఫీకల్ స్లడ్జ్ అండ్ సెప్టేజ్ మేనేజ్మెంట్ (ఎఫ్.ఎస్.ఎస్.ఎం) ప్రాథమిక సూత్రాలు, సురక్షితమైన మలబురద తొలగింపు పద్ధతులు, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (యస్ఓపియస్)పై అవగాహన కల్పించారు. వివిధ అంశాలకు సంబంధించి ప్రదర్శనలు, ప్రాక్టికల్ డ్రిల్స్ కూడా నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు తమ విధులను మరింత సురక్షితంగా, ఆరోగ్యకరంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. పారిశుధ్య కార్మికుల వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని శిక్షణలో పాల్గొన్న కార్మికులకు విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిగత రక్షణ పరికరాల (పిపిఈ) కిట్లను పంపిణీ చేశారు. అలాగే, శిక్షణలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులకు సిఎంఓహెచ్ డాక్టర్ సీహెచ్ నిర్మలా గ్లోరీ, ఎఎంఓహెచ్ డాక్టర్ గోపాల్ నాయక్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు.

# కొండపల్లి మున్సిపాలిటీ ఆదాయానికి గండి

- **ప్లాన్ లలో ఉండేదొకటి, అధికారుల అండదండలతో నిర్మించేదొకటి**
- **పట్టిపట్టినట్లు వ్యవహరిస్తున్న అధికారులు**
- **బిల్డింగ్ ల యజమానులకు అభయమిస్తున్న సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ లు**
- **ప్రశ్నించిన వారికి నోటీసులు ఇచ్చామంటూ సమాధానం**
- **నోటీసు లు అడిగితే ఫోన్ స్విచ్ ఆఫ్**

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 18, (మనం న్యూస్):** అధికారుల మామూళ్ల మత్తుతో కొండపల్లి మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. వెరిఫై చేసి అప్రూవల్ ఇవ్వాల్సిన ఆర్వో స్థాయి అధికారికి ఫైల్ పూర్తిగా చేరకుండానే సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ స్థాయి అధికారులే అక్రమాలకు తెరలేపుతున్న బిల్డింగ్ యాజమాన్లకు పూర్తిగా సహకరిస్తున్నారు. అనుమతి లేని బిల్డింగ్ లను ప్లాన్ అప్రూవల్ లో లేని నిర్మాణాలను దాచిపెడుతూ అన్నివిధాలా దండుకుని జేబులు నింపుకుంటున్న కొండపల్లి మున్సిపాలిటీ అధికారుల తీరుపట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రశ్నించిన వారిని నోటీసులు ఇచ్చామంటూ బకాయిస్తూ, నోటీసుల ను చూపించమని అడిగితే ప్రశ్నించిన వారి నుండి తప్పించుకుంటూ, వివరాలు అడిగిన వారి నంబర్లను సమాధానమేవ్వకుండా అధికారులు బ్లాక్ లో పెడు తున్నట్లు సమాచారం. ఇటీవల కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నం ఫెర్రీలో ప్రధాన రహదారి వెంట నిర్మితమవుతున్న ఒక బిల్డింగ్ కు ప్లాన్ అప్రూవల్ లో లేని విధంగా షట్టర్లు పెట్టి మరి నిర్మిస్తున్న ఇంటి యజమానికి సచివాలయం మూడులో పనిచేసే ప్లానింగ్ అధికారి పూర్తిస్థాయిలో సహకరిస్తూ మున్సిపాలిటీకి గండి పడే విధంగా వ్యవహరిస్తున్నారని పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిని ఆ నిర్మాణం గురించి ఒకసారి ప్రశ్నిస్తే ప్రశ్నకు సమాధానం చెప్పకుండానే నంబర్లను బ్లాక్ లో పెడుతున్నారని ప్రశ్నించిన వారు చెబుతున్నారు. నోటీసులు ఇచ్చామని చెబుతున్న ఆ అధికారి నోటీసులు చూపమంటే చూపట్లేదని సెలవుల్లో ఉన్నానంటూ చెప్తున్నారని సమాచారం. ఏది ఏమైనాప్పటికీ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్న ఇలాంటి నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




# ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల వల్ల కలిగే వ్యాధులను నిర్మూలిద్దాం



**విజయవాడ,సెప్టెంబర్,18,(మనం న్యూస్):** విజయవాడ నగరంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్గన్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం దావు బుచయ్య కాలనీ, మధురా నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో విస్తృత చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నిరంతర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాక్టర్ ఆధారిత ప్రత్యేక యంత్రాలు, బోట్ల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నామని చెప్పారు. సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ నిర్వహించడంతో పాటు, దోమల లార్వాను ఆహారంగా తీసుకునే గాంబూసియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టి జీవసంబంధిత పద్ధతులను కూడా అమలు చేస్తున్నామని వివరించారు. నగరపాలక సంస్థ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వారానికి ఒకరోజు, ముఖ్యంగా ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇంటి లోపల, బయట, డాబాపై మరియు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వాడుకలో లేని బకెట్లు, మగ్గులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, నీటి నిల్వ ఉండే ఇతర పాత్రలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పరిశీలించి వాటిలోని నీటిని పూర్తిగా పారబోయాలని సూచించారు. కేవలం ఐదు నుంచి ఏడు రోజుల పాటు నిల్వ ఉన్న నీటిలోనే దోమల లార్వా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని శాశ్వతంగా నియంత్రించవచ్చని వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తత, నగరపాలక సంస్థ చర్యలు కలిసివస్తేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ నిరీక్షణరావు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా విభాగం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# మొబైల్ కోర్టులో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా




**విజయవాడ,సెప్టెంబర్, 18,(మనం న్యూస్):**విజయవాడ నగరపాలక సంస్థ నగరంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్య పరిరక్షణకు విఘాతం కలిగించే చర్యలపై కఠిన చర్యలు కొనసాగిస్తోంది. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు శుక్రవారం సర్కిల్-2 కార్యాలయంలో సంచార న్యాయస్థానం (మొబైల్ కోర్టు) నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, రహదారులపై చెత్తాచెదారం వేయడం, రోడ్లపై పశువులు మరియు పెంపుడు కుక్కలను విచ్చలవిడిగా వదిలేయడం, కాలువల్లో వ్యర్థాలు వేయడం ద్వారా మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగించడం, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారిని గుర్తించారు.ఈ ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 17 కేసులు నమోదు చేసి నిందితులను మొబైల్ కోర్టులో జడ్జి టి.ఎ.ఎస్.ఎస్.ఆర్.ఎ. రిషిక్ ఎదుట హాజరుపరిచారు. కేసులను విచారించిన జడ్జి నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించగా, మొత్తం రూ. 5,480/- జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. రహదారులు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, నిబంధనలను పాటించి నగర పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భవిష్యత్తులో కూడా మొబైల్ కోర్టుల ద్వారా కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్వైజర్స్ సలీం మహమ్మద్, శానిటరీ ఇన్స్పెక్టర్లు మరియు ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



హనుమాన్ జంక్షన్: సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ): మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకాల్లో భాగంగా మెగా డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ జరిగి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన బాపులపాడు మండలం శేరినరసన్నపాలెం గ్రామం ముందడుగు కాలనీకి చెందిన అభ్యర్థులను శుక్రవారం ఆయన వారి నివాసాలకు వెళ్లి అభినందించారు. సొదిమెళ్ల సత్యన్నారాయణ వీరవల్లి పాఠశాలలో పీజీటీ ఫిజిక్స్గా, పసగడి రమేష్ స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా ఎంపికైన సందర్భంగా వారిని దుశ్శాలువాలతో సత్కరించారు. ఉద్యోగం సాధించేందుకు వారు చేసిన కృషి, ఎదుర్కొన్న సవాళ్లను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తూనే 22 నుంచి 26 ఏళ్లపాటు నిరంతరం శ్రమించి, చివరి అవకాశంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మెగా డీఎస్సీ హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకాల్లో భాగంగా ఉద్యోగాల భర్తీ చేపట్టడంతో వేలాది మంది నిరుద్యోగులకు ప్రయోజనం కలిగిందన్నారు. ఉపాధ్యాయ వృత్తి సమాజానికి దిశానిర్దేశం చేసే పవిత్రమైన బాధ్యత అని పేర్కొన్నారు. తమ వద్ద చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే ఉపాధ్యాయులకు అసలైన ఆనందం లభిస్తుందన్నారు. వీరవల్లి పాఠశాలలో భవన సమస్య పరిష్కారానికి అమెరికాలోని ఓ ఎన్నారై సహకారంతో రూ.12 లక్షలు సమకూర్చామని ఎమ్మెల్యే తెలిపారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. 1979లో అప్పటి కలెక్టర్ ఏవీఎస్ రెడ్డి చేసిన సేవలను ముందడుగు కాలనీ ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకోవడం అభినందనీయమన్నారు. ఏవీఎస్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారని తెలిపారు. కొత్తగా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన సత్యనారాయణ, రమేష్ తమ పుట్టిన ఊరికి సేవ చేయడంతో పాటు స్థానిక పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి వారి అభ్యున్నతికి తోడ్పడాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సొదిమెళ్ల సత్యన్నారాయణ మాట్లాడుతూ 2004 నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నానని, నాలుగుసార్లు విఫలమైనప్పటికీ పట్టుదల వీడలేదన్నారు. ఐదోసారి విజయం సాధించి కృష్ణా జిల్లాలో 12వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం వీరవల్లి ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ బోధిస్తున్నానన్నారు. 2018 నుంచి 2025 వరకు డీఎస్సీ కోసం ఎదురుచూస్తూ ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే చదువుకున్నానని చెప్పారు. పిల్లలకు బోధించిన తర్వాత వారితోపాటు తాను కూడా చదువుతూ చివరకు 2025 డీఎస్సీలో ప్రభుత్వ ఉద్యోగం సాధించానన్నారు. తమ కుటుంబానికి భరోసా కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముందడుగు కాలనీ అభివృద్ధికి ఎమ్మెల్యే మరింత సహకరించాలని కోరారు.పసగడి రమేష్ మాట్లాడుతూ శేరినరసన్నపాలెం గ్రామానికి చెందిన తాను 24 ఏళ్లుగా ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నానన్నారు. గతంలో రెండుసార్లు విఫలమైనప్పటికీ మూడో ప్రయత్నంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించానని తెలిపారు. ఇది తన జీవితంలో చివరి అవకాశం కావడంతో ఎంతో పట్టుదలతో చదివి విజయం సాధించానన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కు కృతజ్ఞతలు తెలిపారు. తన చిరకాల కోరిక నెరవేరిందని, ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు తన వంతు సేవ చేస్తానని చెప్పారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే రాత్రింబవళ్లు కష్టపడి చదివి, ఎవరికి డబ్బులు ఇవ్వకుండా తమ ప్రతిభతోనే ఉద్యోగాలు సాధించామని వారు తెలిపారు. డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తూ ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడవద్దని కోరారు. కష్టపడి చదివి ప్రతిభతో ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాబోయే తరాల అభ్యర్థులు ఇటువంటి ప్రచారాలను పట్టించుకోకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని డీఎస్సీ నోటిఫికేషన్లు వస్తాయని, యువత అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ చేసిన కారణంగా మెగా డీఎస్సీ ద్వారా తమలాంటి ఎన్నో కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడి బాధ్యత కేవలం పాఠాలు చెప్పడంతో ముగియదని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. తమకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తామని తెలిపారు.

# సామూహిక ఎలుకల నిర్మూలనకు రైతులు సహకరించాలి



**పామర్రులో పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా**

పామర్రు: సెప్టెంబరు 18,(మనం న్యూస్): పంటలకు నష్టం కలిగించే ఎలుకలను సామూహికంగా నిర్మూలించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పామర్రు మండలంలోని పామర్రు ఎస్కేఆర్ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఆరేపల్లి కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మీకోసం కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్, పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజాతో కలిసి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి కె. జ్యోతి రమణి సామూహిక ఎలుకల నివారణకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ.. జిల్లాలో ఎలుకల నివారణకు బ్రొమోడయోలిన్ మందును 100 శాతం రాయితీపై రైతు సేవా కేంద్రాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులు ఈ మందును వినియోగించి ఎలుకలను సమర్థవంతంగా నివారించాలని సూచించారు. ఎకరాకు 250 గ్రాముల నూకలు, 4 గ్రాముల నూనె, 4 గ్రాముల బ్రొమోడయోలిన్ కలిపి విషపు ఎరను తయారు చేసి, 10 గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి ఎలుకల బొరియల్లో ఉంచాలని వివరించారు. ముందుగా బొరియలను మట్టితో మూసివేసి, మరుసటి రోజు తెరుచుకున్న బొరియలను గుర్తించి వాటిలో మందు ఉంచాలని సూచించారు. మందు తయారీ సమయంలో గ్లౌజులు లేదా కర్రపుల్లను ఉపయోగించి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఒకే రోజున సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించి పంటలకు ఎలుకల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ పామర్రు బి. స్వర్ణలత, మండల వ్యవసాయ అధికారులు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

# జర్మనీ ఫ్రాంక్ఫర్ట్ ఎయిర్పోర్టులో టీడీ జనార్ధన్కు ఘన స్వాగతం



జగ్గయ్యపేట సెప్టెంబర్ 18 మనం న్యూస్: జర్మనీ తెలుగు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలుగుసంబరం-2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు జర్మనీకి వెళ్లిన జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ మరియు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ కి ఫ్రాంక్ఫర్ట్ ఎయిర్పోర్టులో తెలుగు వారు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జర్మనీలోని తెలుగు సంఘాల ప్రతినిధులు, తెలుగు భాషాభిమానులు, ప్రవాసాంధ్రులు పెద్ద సంఖ్యలో ఎయిర్పోర్టుకు చేరుకుని పుష్పగుచ్ఛాలు అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పేలక్ష్యంతో నిర్వహిస్తున్న తెలుగు సంబరం-2026లో తొండపు దశరథ జనార్దన్ ముఖ్య అతిథిగా పాల్గొనడం పట్ల జర్మనీ తెలుగు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.తెలుగు భాషా సాహిత్య పరిరక్షణ, తెలుగు సంస్కృతి ప్రచారం, భావితరాలకు తెలుగు వారసత్వాన్ని అందించడంపై ఈ సందర్భంగా ప్రత్యేకంగా చర్చించనున్నారు.

# ఈనాం భూముల సమస్యతో సహా పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాయి ప్రసాద్ కి వివరించిన ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్



జగ్గయ్యపేట సెప్టెంబర్ 18 మనం న్యూస్: జగ్గయ్యపేట పట్టణంలోని ఈనం భూముల సమస్యతో సహా నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ను కలసి ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ వివరించారు. జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ని శుక్రవారం కలిసి నియోజకవర్గంలోని పలు కీలక సమస్యలపై చర్చించారు. నియోజకవర్గంలో ఉన్నటువంటి ఈనాం భూముల సమస్యను శాసనసభ్యులు ప్రస్తావించగా, ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్నదని పేర్కొంటూ, ఒక టీంగా ఏర్పడి సంబంధిత మంత్రి ని కలిసి పూర్తి వివరాలతో అవగాహన కల్పించి దీనిపై సముచిత నిర్ణయం తీసుకుందామని ప్రధాన కార్యదర్శి తెలిపారు.జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎప్పటినుంచో పెండింగ్లో ఉన్నటువంటి పోలంపల్లి ప్రాజెక్టు గురించి ప్రస్తావించగా, దానిపై సానుకూలంగా స్పందించిన ప్రధాన కార్యదర్శి , ఇరిగేషన్ అధికారులతో సరైన చర్యలు తీసుకుని ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో ఎప్పటినుంచో ఉన్నటువంటి దుర్గాపురం ఊర చెరువు ముంపు ప్రాంతంలో ఏడబ్ల్యూడీ ల్యాండ్ క్లాసిఫికేషన్ మార్చవలసిందిగా కోరగా, ఈ అంశాన్ని వెంటనే రెవిన్యూ అధికారులకు పంపడం జరిగింది. ముక్త్యాల వద్ద హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి స్థలం కేటాయించవలసిందిగా కోరగా, సంబంధిత ఫైలును వెంటనే సిద్ధం చేయాలని కింది స్థాయి అధికారులకు ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. ఈ విధంగా పలు అంశాలపై సి.ఎస్. ని కలవగా, వారు సానుకూలంగా స్పందించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కింది అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించిన వెంటనే ప్రధాన కార్యదర్శి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేయడం పట్ల తీవ్ర సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ను తనిఖీ చేసిన కలెక్టర్



**వైద్య సేవలు, రికార్డుల నిర్వహణపై క్షుణ్ణంగా పరిశీలన**

తరకటూరు(గూడూరు): సెప్టెంబరు 18, (మనం న్యూస్): ప్రజలకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి శుక్రవారం గూడూరు మండలం, మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తరకటూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్న కలెక్టర్, ఓపీ రిజిస్టర్, రిఫరల్ రిజిస్టర్, డ్రగ్ రిజిస్టర్, ఎన్సీడీ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, రికార్డుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారా అని ఎంఎల్హెచ్పీని అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, వారి ఆరోగ్య పరిస్థితిపై నిరంతర ఫాలోఅప్, సంబంధిత వివరాల నమోదు ప్రక్రియపై ఏఎన్ఎంను ఆరా తీశారు. ఆశా కార్యకర్తలతో మాట్లాడిన కలెక్టర్, తమ పరిధిలోని ఏఎన్సీ, లెప్రసీ, టీబీ, అధిక రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులకు సంబంధించిన వ్యక్తుల వివరాలను తప్పనిసరిగా రికార్డుల రూపంలో నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ప్రాథమిక స్థాయిలోనే సమర్థవంతమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి.ఎల్. దయాకర్, మల్లవోలు మెడికల్ ఆఫీసర్ డా. తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పామర్రులో నియోజకవర్గస్థాయి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహణ



**ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ డీకే బాలాజి, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా**

**పామర్రు: సెప్టెంబరు 18,(మనం న్యూస్):** ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని, ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు.పామర్రు నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో శుక్రవారం పామర్రులో నియోజకవర్గస్థాయి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు .పామర్రు ఎస్కేఆర్ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఆరేపల్లి కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజాతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

**పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: శాసన సభ్యుడు వర్ల కుమార్ రాజా**

పామర్రు నియోజకవర్గ శాసన సభ్యుడు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి సత్వర పరిష్కారం చూపించడమే మీ కోసం కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నాలుగు వారాలుగా పామర్రు నియోజకవర్గాన్ని సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లా నుంచి మండల స్థాయి వరకు వివిధ శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరై పెండింగ్లో ఉన్న, క్లిష్టమైన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నారని చెప్పారు.'విజన్ పామర్రు'లో భాగంగా నియోజకవర్గ అభివృద్ధికి వివిధ శాఖలు, స్థానిక సంస్థల నిధులను సమన్వయం చేస్తున్నామని తెలిపారు. రాబోయే దసరా, సంక్రాంతిలోపు 'పల్లె పండుగ-3.0' ద్వారా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి సుమారు రూ.7 కోట్లు, శ్రీవాణి పథకం కింద 11 ఆలయాలకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు.సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పటివరకు నియోజకవర్గ ప్రజలకు సుమారు రూ.14 కోట్ల ఆర్థిక సహాయం అందించామని, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి ఎస్డిసి పి నీలకంఠేశ్వరరెడ్డి, ఉయ్యూరు ఆర్డిఓ ఎస్ కరుణ కుమారి, డీఎస్పీ పాల శ్రీనివాసరావు, పామర్రు, పెదపారుపూడి, పమిడిముక్కల, మొవ్వ, తోట్లవల్లూరు మండలాల తహసిల్దార్లు రవికాంత్, శ్రీను నాయక్, నవీన్ కుమార్, కే మస్తాన్, కుసుమకుమారి సంబంధిత శాఖల అధికారులు, డివిజన్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**పామర్రు నియోజకవర్గ సమస్యల**



## సుస్థిర ఆర్థిక వృద్ధికి వ్యూహాత్మక అడుగులు..




- **అమరావతి ఎకనమిక్ రీజియన్‌తో సరికొత్త పారిశ్రామిక స్వరూపం**
- **ఏఈఆర్లో ఎన్టీఆర్ జిల్లా భాగం కావడం గర్వకారణం**
- **అన్ని రంగాల్లో సామర్థ్యాల సద్వినియోగం అత్యంత కీలకం**
- **క్లస్టర్ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి**
- **ప్రత్యేక వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ,సెప్టెంబర్,18,(మనంప్రతినిధి):** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు అమరావతి ఎకనమిక్ రీజియన్ (ఏఈఆర్)తో సరికొత్త ఊపు రానుందని.. పారిశ్రామిక రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అమరావతి ఎకనమిక్ రీజియన్లో ఎన్టీఆర్ జిల్లా భాగం కావడం జిల్లాకు గర్వకారణమని, ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను మరింత పెంపొందించే దిశగా సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.నవ్య రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా, దానిచుట్టూ ఉన్న జిల్లాలను అనుసంధానిస్తూ అమరావతి ఎకనామిక్ రీజియన్ పేరుతో భారీ ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికల రూపకల్పనలో భాగంగా మేధోమథన చర్చలు, వర్క్షాప్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏఈఆర్ ప్రణాళికపై జిల్లాస్థాయి భాగస్వామ్య పక్షాలతో వర్క్షాప్ జరిగింది. ఈ వర్క్షాప్లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, సమన్వయ శాఖల అధికారులు హాజరుగా కాగా పీడబ్ల్యూసీ ప్రతినిధి బినయ్ సోరెంగ్.. వికసిత్ భారత్ 2047 తొమ్మిది పిల్లర్స్తో పాటు స్వర్ణాంధ్ర విజన్లోని శూన్య పేదరికం, నైపుణ్యాభివృద్ధి, అగ్రీ టెక్, డీప్ టెక్ తదితర పది సూత్రాలను వివరించారు. అదే విధంగా జిల్లాలో ఆర్థిక వృద్ధికి ఉన్న కీలక అవకాశాలను వివరించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలు వంటి సంప్రదాయ రంగాలతో పాటు ఐటీ, ఐటీఈఎస్, డిజిటల్ సేవలు వంటి సన్రైజ్ రంగాల్లోనూ అధిక వృద్ధికి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, రవాణా, వాణిజ్యం, పర్యాటకం తదితర రంగాల్లో ఉన్న అవకాశాలను గుర్తించి, పరస్పర అనుసంధానంతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలు, వనరులు, నైపుణ్యాలు, మౌలిక వసతులను గుర్తించి వాటికి అనుగుణంగా క్లస్టర్ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధి చేపట్టడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని.. ఈ దిశగా ఇప్పటికే దృష్టిసారించినట్లు వివరించారు. స్థానికంగా లభించే వనరులకు విలువను జోడించే పరిశ్రమలను ప్రోత్సహించడం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అవసరమైన సహకారం అందించడం, యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిపెడుతున్నామని.. అమరావతి ఎకనమిక్ రీజియన్ ద్వారా ఏర్పడే అవకాశాలను జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, యువత, మహిళా పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకునేలా అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం అందించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, ప్రైవేటు రంగ భాగస్వామ్యం, స్థానిక వనరుల సమర్థ వినియోగం ద్వారా సుస్థిరమైన, సమగ్ర ఆర్థిక వృద్ధికి బాటలు వేయవచ్చని తద్వారా ఏఈఆర్లో కీలక ప్రాంతంగా జిల్లాను నిలబెట్టవచ్చని పేర్కొన్నారు.వర్క్షాప్లో వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారులతో పాటు పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఇవి రాష్ట్ర స్థాయిలో సమగ్ర ప్రణాళికల రూపకల్పనకు దోహదపడతాయి.కార్యక్రమంలో సీపీవో వై.శ్రీలత, వీఎంసీ చీఫ్ ఇంజనీర్ పి.సత్యకుమారి, వినోద్ (జేఆర్టీ టాటా ఇండస్ట్రియల్ ఎస్టేట్), రామచంద్రరావు, పార్థసారథి (ఎంఎస్ఎంఈ అసోసియేషన్), అల్ట్రాటెక్, సెంటిని, శ్రీ భరత్ ల్యాబ్స్ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ పై జగన్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు

- **22 మంది ఎంపీలను ఇస్తే కేసుల మాఫీ కోసం పైరవీలు తప్ప జగన్ రాష్ట్ర ప్రయోజనాలను ఏనాడు పట్టించుకోలేదు.**
- **ఐదేళ్లలో ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పనులు చేస్తుంటే ఓర్వలేక విమర్శలు: మాజీ మంత్రి దేవినేని ఉమా.**




**గొల్లపూడి,సెప్టెంబర్ 18 (మనం న్యూస్):** రైతాంగం, సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేసి, కీలక ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిన జగన్రెడ్డి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గొల్లపూడి లోని కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడిన ఉమా రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై జగన్ రెడ్డి చేస్తున్న ఫేక్ ప్రచారాలపై తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టుదల, కృషితోనే పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందని ఉమా పేర్కొన్నారు. పోలవరం డయాఫ్రం వాల్ విషయంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం, ఉద్దేశపూర్వక నిర్ణయాలే ప్రాజెక్టుకు నష్టం కలిగించాయని ఆరోపించారు. 2023 మార్చిలోనే 41.15 మీటర్ల ఎత్తుకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన జగన్రెడ్డి.. ఇప్పుడు అదే అంశంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 22 మంది ఎంపీలను పెట్టుకుని రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలారు అని ఉమా విమర్శించారు. ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు, రాష్ట్ర హక్కులు, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం వద్ద గట్టిగా మాట్లాడకుండా కేసుల మాఫీ కోసం పైరవీలకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. పట్టిసీమ నీళ్లు తాగుతూ, వాడుకుంటూ ఆ ప్రాజెక్టు పేరు చెప్పడానికి జగన్కు ఇష్టం ఉండదు అని ఉమా ఎద్దేవా చేశారు. ఐదేళ్లు అధికారంలో ఉండి అనేక డ్రామాలు చేసిన జగన్రెడ్డి.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక లిఫ్ట్ లు అంటూ ఎగతాళి చేసే విధంగా మాట్లాడుతున్నారని అన్నారు. ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుగానే అప్రమత్తమై చర్యలు చేపట్టారని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను అంచనా వేసి రైతులను అప్రమత్తం చేయడంతో పాటు సమగ్ర నీటి నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో నీటి సమస్యలు తలెత్తకుండా సాగునీరు, తాగునీటి అవసరాలను సమన్వయంతో నిర్వహిస్తున్నారని వివరించారు. దశాబ్దాలుగా తమను ఆదరించిన పులివెందుల ప్రాంతానికే నీళ్లు అందించలేని జగన్రెడ్డి.. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని దేవినేని ఉమా అన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లోనూ రాయలసీమలో సాగునీరు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చంద్రబాబు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి, ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని ఉమా అన్నారు. రైతాంగ ప్రయోజనాలే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు.

## రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎ.పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ధర్నా



- **మున్సిపల్ పౌర సేవల ప్రైవేటీకరణ అపాలి**
- **కార్మికులను పర్మినెంట్ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి**

నందిగామ,సెప్టెంబర్ 18(మనం న్యూస్): సిఐటియు నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు కెగోపాల్ మాట్లాడుతూ స్ట్రీట్ లైట్ ప్రైవేటీకరణ ఆపాలి,పారిశుధ్యం కార్మికులు ప్రైవేటీకరణ ఆపాలి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి,రిటైర్మెంట్ అయిన వారి స్థానంలో వారి పిల్లలకు కుటుంబ సభ్యులకి అవకాశం కల్పించాలి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలి,పి ఆర్ సి మున్సిపల్ కార్మికులకు అమలు చేయాలి, ఏళ్ల తరబడి పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు పర్మినెంట్ చేయకుండా ప్రస్తుతం రిటైర్మెంట్ అయిన వారికి చిలి గవ్వ కూడా ఇవ్వకుండా ఒట్టి చేతులతో పంపటం దుర్మార్గమైన చర్యను తక్షణమే కూటమి ప్రభుత్వం రిటైర్మెంట్ అవుతున్న కార్మికులకు 5 లక్షలు బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. 14 రకాల పౌర సేవలను ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం అతిత్సాహం చేయటం అత్యంత విచారకరమన్నారు. సేవలన్ని ప్రైవేటుపరం చేస్తే ఉద్యోగులు పాలక బోర్డులు ఉత్సవ విగ్రహాల లాగా ఉండాల్సిన పరిస్థితి ఉంటుందని అలాంటప్పుడు ఎన్నికల జరిపి ఏమి ఉపయోగం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ సేవలు ప్రైవేటీకరణ ను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం పునః ఆలోచించి సేవల ప్రైవేటీకరణ ఆపాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దసవరపు సైదా,సలికేటి నరేష్, మాణిక్యం, బేబీ,భూషి,సంతీష్, కార్మికుల పాల్గొన్నారు.

## 35 కి.మీ. పాదయాత్రతో వేదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దర్శనం



- **నందిగామ మండల టీడీపీ అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి**

నందిగామ,సెప్టెంబర్ 18(మనం న్యూస్): ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం నందిగామ మండలం కంచల గ్రామంలోని తన స్వగృహం నుంచి నందిగామ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి సుమారు 35 కిలోమీటర్లు కాలినడకన పాదయాత్రగా వెళ్లి జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నందిగామ నియోజకవర్గం, ఎన్టీఆర్ జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యా లతో ఉండాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు వీరాస్వామి తెలిపారు. వీరంకి వీరాస్వామి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక విశ్వాసంతో చేపట్టిన ఈ పాదయాత్ర మంచి అనుభూతినిచ్చింది అని ప్రజల ఆశీస్సులు, స్వామివారి అనుగ్రహంతో మరింత బాధ్యతతో ప్రజలకు సేవ చేస్తానని వీరాస్వామి పేర్కొన్నారు.

## నందిగామ ప్రగతికి రెండేళ్ల లెక్క వాగ్దానాలు కాదు.. ఫలితాలు



- **కూటమి పాలనలో అభివృద్ధికి కొత్త ఊపు..**

నందిగామ,సెప్టెంబర్ 18(మనం న్యూస్): మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ ప్రసంగాల కంటే ముందుగా రెండేళ్ల పాలనకు ప్రజల ముందు లెక్క చెప్పడమే తన బాధ్యతగా భావిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వెల్లడి. ప్రజల ఆశీర్వాదంతో బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మాటలకు కాకుండా ఆచరణకు ప్రాధాన్యత ఇస్తూ నందిగామ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రెండేళ్లలో నందిగామ సాధించిన కీలక విజయాల్లో మున్సిపాలిటీకి గ్రేడ్-1 హోదా దక్కడం ముఖ్యమని సౌమ్య పేర్కొన్నారు. కూటమి కౌన్సిల్ తీర్మానంతో ప్రభుత్వం 2026 జూన్ 1న జీవో ఎంఎస్ 114 ద్వారా ఈ హోదాను కల్పించిందన్నారు. దీంతో పట్టణానికి మరిన్ని నిధులు, మెరుగైన పరిపాలనా అవకాశాలు, స్థానిక సమస్యలను వేగంగా పరిష్కరించుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు.

### రూ.22 కోట్లకు పైగా అభివృద్ధి పనులు

గ్రేడ్-1 హోదాతో పాటు పట్టణ అభివృద్ధికి భారీగా నిధులు సమకూరాయని సౌమ్య తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా రూ.19 కోట్లు, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.3.40 కోట్లు కలిపి రూ.22 కోట్లకు పైగా పనులకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ నిధులతో రూ.3 కోట్లతో నూతన మున్సిపల్ కార్యాలయం, పలు వార్డుల్లో 15 కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు, గాంధీ సెంటర్-రామన్నపేట మార్గంలో సెంట్రల్ డివైడర్, లైటింగ్, రైతుపేట డొన్లోని గోవర్ధన్ గార్డెన్స్ వద్ద అర ఎకరంలో పార్క్ ఏర్పాటు కానున్నాయని చెప్పారు. (రానున్న రోజులలో నందిగామలో ప్రతి రోడ్డును సిమెంటు రోడ్డుగా చేసి చూపిస్తాం)

### తెలుగుదేశం పాలనలో మొదలైన ప్రగతి.. కూటమి పాలనలో వేగం

నందిగామ అభివృద్ధి ప్రస్థానంలో ఉత్తమ పంచాయతీ అవార్డు నుంచి నగర పంచాయతీగా, అనంతరం మున్సిపాలిటీగా ఎదిగి, ఇప్పుడు గ్రేడ్-1 హోదా సాధించిందని సౌమ్య తెలిపారు. ఈ అభివృద్ధి మెట్లన్నీ తెలుగుదేశం పాలనలో ఎక్కినవేనని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ ప్రయాణాన్ని మరింత వేగవంతం చేస్తోందన్నారు.

### కృష్ణమ్మ నీళ్లు.. కేంద్రీయ విద్యాలయం.. ఆసుపత్రి.. శివాలయం

నందిగామలో ప్రజలకు కళ్లముందు కనిపించే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సౌమ్య గారు వివరించారు. రూ.103 కోట్ల తాగునీటి పథకం ద్వారా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కృష్ణా జలాలను ఇంటింటికీ అందించే దిశగా పనులు సాగుతున్నాయని తెలిపారు. పిల్లల భవిష్యత్తు కోసం కేంద్రీయ విద్యాలయంలో తరగతులు ప్రారంభమయ్యాయని, శాశ్వత భవనం కోసం ఐదెకరాల భూమి కేటాయించామని చెప్పారు. అలాగే 100 పడకల ఆసుపత్రి నిర్మాణం శరవేగంగా సాగుతోందని, ఆయుష్ ఆసుపత్రి కూడా రాబోతోందని తెలిపారు. శతాబ్దాల చరిత్ర కలిగిన నందిగామ శివాలయ అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయని పేర్కొన్నారు.

### అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యం

మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పట్టణంలోని ప్రతి వార్డులో అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని సౌమ్య తెలిపారు.

### గత పాలనలో శిలాఫలకాలు.. ఇప్పుడు నిర్మాణాలు

గత వైసీపీ పాలనలో కేంద్రీయ విద్యాలయం, ఆసుపత్రి, శివాలయం, కృష్ణా జలాల పేరుతో అనేక ప్రకటనలు చేసినా అవి కార్యరూపం దాల్చలేదని సౌమ్య విమర్శించారు. అప్పుడు కాగితాలపై ప్రణాళికలు, ఎల్ఈడీ బోర్డులు, శిలాఫలకాలు కనిపించాయి.. ఇప్పుడు వాటి స్థానంలో నిర్మాణాలు కనిపిస్తున్నాయి అన్నారు. ఓటమి తర్వాత కూడా అభివృద్ధిని అడ్డుకునేందుకు కోర్టులు, శాసనమండలి, ప్రెస్మీట్ల ద్వారా ప్రయత్నాలు చేశారని ఆమె ఆరోపించారు. ఇప్పుడు పనులు కళ్లముందు కనిపించడంతో వాటి ఘనతను తమ ఖాతాలో వేసుకునేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

### నందిగామ ప్రజలకు అన్నీ తెలుసు

ఎవరు ఏం చేశారో నందిగామ ప్రజలకు స్పష్టంగా తెలుసని సౌమ్య అన్నారు. వాళ్లు అడ్డుకున్నారు.. మేము ముందుకు నడిపించాం. ఆ తేడానే నేడు నందిగామలో కనిపిస్తున్న మార్పు అని పేర్కొన్నారు. కాగితంపై హామీకి కాలపరిమితి ఉంటుంది.. నేలపై నిలిచిన నిర్మాణానికి తరాల గుర్తింపు ఉంటుంది ఇది తన వ్యక్తిగత విజయం కాదని, తనపై నందిగామ ప్రజలు ఉంచిన నమ్మకానికి దక్కిన ఫలితమని సౌమ్య తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి ప్రాజెక్టుపై ప్రజలకు విడివిడిగా వివరాలు అందిస్తానని చెప్పారు. అభివృద్ధి ఆగకూడదు.. నందిగామ మరింత ముందుకు సాగాలి. ఆ నిర్ణయం ప్రజల చేతుల్లోనే ఉందని సౌమ్య స్పష్టం చేశారు.

## మన అంగన్ వాడి – మనభాధ్యత ప్రతిజ్ఞ

- **9వ జాతీయ పోషణ మాసం – 2026**




నందిగామ, సెప్టెంబర్ 18(మనం న్యూస్): ప్రతిజ్ఞా మన అంగన్ వాడి - మనబోధ్యత ప్రతిజ్ఞ ద్వారా ప్రారంభం. 9 వ జాతీయ పోషకా వంసం కార్యక్రమం లో భాగంగా సొమవరం - 2 అంగన్ వాడి కేంద్రంలో నిర్వ హితలుం అయిన ఆంగన్ వాడి విధ ఆటపాటల విద్య కనుక ఆంగన్ వాడి కాంద్రమునకు 3-6 సంచ్ఛల పిల్లలకు ప్రతి రోజు రిమోట్ లెర్నింగ్ మెసేజస్ ప్రథమ్ వారి వద్ద నుండి అంగన్వాడి కార్యకర్తలకు చేరుతాయి. ఈ కార్యక్రమాల్లో పిల్లల్లో శరీరక, మానసిక, బాషా, సంపత్రి ఆకయ్ మేధోభివృద్దికి చేయించవలసిన కార్యక్రమాలు అన్ని వీడియోస్ చూసి చేయించటం వల్ల సమగ్ర అభివద్ధిని పొందుతారు. దానికి అనుగుణంగ కేంద్రంలో వేడి వేడి భోజనం, గుడ్డు, పాలు తోసుకోవటం ద్వారా పిల్లలు ఆరోగ్య వంతులుగా ఎదుగుదల ఉంటుంది. తెలిపితిని కార్యకర్తలు జ్యోతి, ధనలక్ష్మి తల్లి, తండ్రుల చిన్నారులు పాల్గోనటం జరిగినది.

## ఘనంగా గ్రామాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు



నందిగామ,సెప్టెంబర్ 18(మనం న్యూస్): నందిగామ మండలం లోని కొనతమాత్మకూరు తో పాటు పలు గ్రామాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు, గురువారం కొణతమాత్మకూరు గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు రాష్ట్ర టిడిపి నాయకులు సజ్జ అజయ్, జిల్లా టిడిపి నాయకులు మన్నేపల్లి వినయ్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మంద రమేష్, గ్రామ నాయకులు జవ్వాది ప్రదీప్ లు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ముందుగా టిడిపి నాయకులు కొత్త గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.. గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు డి రవి వర్మ, డి మనోజ్, మణికంఠలు టిడిపి నాయకులకు స్వామివారి శేష వస్త్రం ప్రసాదాలు అందజేశారు.. పవిత్ర కార్యక్రమంలో పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు..

## విశ్వహిందూ పరిషత్ నందిగామ ప్రఖండ వారి ఆధ్వర్యంలో భగవద్గీత పుస్తకాలని పంపిణీ



నందిగామ,సెప్టెంబర్ 18 (మనం న్యూస్): నందిగామలో శ్రీ నారాయణ ఆంగ్లవేదిక్ స్కూల్, మరియు, కాకతీయ పాఠశాలల నందు. భగవద్గీతకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కొమరగిరి వాచస్పతి పాల్గొన్నారు. నందిగామ ప్రఖండ అధ్యక్షులు కందుకూరిరమణమూర్తి, సత్సంగ ప్రముఖ దుడ్డు నాగేశ్వరరావు, కార్యదర్శి కావూరి సురేష్, సమరసతా ప్రముఖ విశ్వనాథ్, బజరంగ్దళ్ సంయోజక్ శివ నరసింహారావు పాల్గొన్నారు.

## కోనేరు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలలో క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు



నందిగామ,సెప్టెంబర్ 18(మనం న్యూస్): శివాలయ కోనేరు ఆక్రమణలు తొలగించాలంటూ కోనేరు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలలో ఈరోజు క్లాత్ మర్చంట్ అసోసియేషన్ పలువురు సభ్యులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు అనుమోలు వెంకట శ్రీనివాస్ రావు మాట్లాడుతూహైకోర్టు ఆదేశాలున్నా అధికారుల ఉదాసీనతపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆక్రమణలు తొలగించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామనిహెచ్చరిస్తూ పవిత్రమైన కోనేరు స్థలాన్ని ఆక్రమణల నుండి విముక్తి చేయాలని హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చినప్పటికీ, సంబంధిత అధికారులు కలెక్టర్ కి పలుమార్ల విన్నవించినప్పటికీ నిర్లక్ష్యంగా, మొండి వైఖరితో వ్యవహరించడం శోచనీయమన్నారు. కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ కాలయాపన చేయడం దారుణమని మండిపడ్డారు. యంత్రాంగం ఇప్పటికైనా తక్షణమే స్పందించి కోనేరు ఆక్రమణలను శాశ్వతంగా తొలగించకపోతే, నందిగామ పట్టణ బంద్ చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కోనేరు స్థలమును ఆక్రమించిన ప్రదేశంలో ఉన్న నిరుపేదలకు ప్రభుత్వం వారు తక్షణమే స్థలములు కేటాయించి వారిని కాళీ చేయించి శ్రీవారి కార్యక్రమాలైనా తె ప్పోత్సవం, మరియు స్వామి వారికి జరుగు విశేష కార్యక్రమలు జరిగే విధముగా ప్రభుత్వము వారు సహకరించాలని, హిందువుల మనోభావాలను గుర్తించాలనికోరారు.ఈ నిరాహార దీక్షా శిబిరంలో ది క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు అనుమోలు వెంకట శ్రీనివాసరావు, చవట పాప, మహంకాళి వెంకటేశ్వరరావు, చవట నవీన్, ఏచూరి నాగరాజు, తాతా సంతోష్, లింగమల్లు నాగేశ్వరరావు, నకరికంటి శ్రీనివాసరావు, మహంకాళి లక్ష్మీనారాయణ, గోపు సుధాకర్, మహంకాళి ప్రసాద్, పి. సుభాని, మణి, చవట సురేష్, మారం లక్ష్మీనరసింహ, పాదర్తి విశ్వేశ్వరరావు, పారేపల్లి బెనర్జీ, చేజర్ల గోపీనాథ్, చవట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. దీక్షా శిబిరంలో పట్టణ ప్రముఖులు, హిందూ భక్తులు వివిధ వ్యాపార వర్గాలు వారు పాల్గొన్నారు.

## ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే

**▸▸ మంత్రి కందుల దుర్గేష్**

**గుంటూరు,సెప్టెంబర్, 18,(మనం న్యూస్)** :ఎన్నిక ఏదైనా విజయం కూటమిదేనని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గుంటూరులోని 'ది క్యాపిటల్' హోటల్లో శుక్రవారం జరిగిన కూటమి భాగస్వామ్య పక్షాల (టీడీపీ, జనసేన, బీజేపీ) నాయకుల సమన్వయ సమావేశంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సంపూర్ణ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ క్షేత్రస్థాయిలో సమైక్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.రాష్ట్ర స్థాయిలో ఇదివరకే ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీల మార్గదర్శకత్వంలో ప్రతి జిల్లాలో భాగస్వామ్య పార్టీల బలాబలాలను బేరీజు వేసుకుంటూ సమన్వయ భేటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అధిష్టానం ఎవరిని అభ్యర్థిగా ప్రకటిస్తే వారి గెలుపునకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పని చేయాలని, అధిష్టానానిదే అంతిమ నిర్ణయమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల ప్రగతి, ప్రజా ఆకాంక్షలు నెరవేర్చడం, 'సూపర్ సిక్స్' పథకాల అమలు తీరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి మద్దతు కూడగడతామన్నారు.. ముందుగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు, అనంతరం పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయని... ఎన్నిక ఏదైనా, అభ్యర్థి ఎవరైనా కూటమి విజయం తథ్యమని పేర్కొన్నారు. నూటికి నూరు శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని, ఈ సెప్టెంబర్లోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, అక్టోబర్లో ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. నాటి వైకాపా పాలనలో ప్రతిపక్షాలను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకుండా బలవంతపు ఏకగ్రీవాలకు పాల్పడ్డారని విమర్శించారు. నేడు వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో పోటీ పడలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం మాత్రం పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను ఎదుర్కొని ప్రజల మనసు గెలుచుకుంటుందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. మీడియా సమావేశం అనంతరం నాయకులంతా కలిసి జై కూటమి అని నినదించారు. ఈ సమావేశంలో టీడీపీ తరపున కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పిల్లి మాణిక్యాలరావు, రాజు, బీజేపీ తరపున తిరుపతిరావు, సూర్యనారాయణ, జయప్రకాష్, జనసేన తరపున చిల్లపల్లి శ్రీనివాసరావు, బిట్రగుంట మల్లిక్, షేక్ నాయక్ కమల్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఇనాం భూ బాధితుల రాష్ట్ర అధ్యక్షుడి గుండెకు శాస్త్ర చికిత్స

**దశాబ్ద కాల ఇనాం భూ పోరాట యోధుడిగా పేరుగాంచిన రాటకొండ కోటేశ్వరరావు గుండే కు చికిత్స చేసిన స్టార్ హెల్త్ వైద్యశాల వైద్యులు.**

**సర్వీస్ ఇనామ్ భూ బాధితుల కోసం అలుపెరగని పోరాటం చేసే క్రమంలో ఆయన ఆరోగ్యాన్ని సైతం ఖాతరు చేయకుండా నిత్యం భూబాధితుల కోసం ఆలోచించిన నాయకుడు ప్రెస్ కోటేశ్వర రావు.**



**నందిగామ,సెప్టెంబర్ 18(మనం న్యూస్):** సర్వీస్ ఇనాం భూముల 22ఎ 1సి నుండి తొలగించమని, ఇ నామ్ భూ ముల కొరకు అనేక దఫలు గా ఉద్యమాలు చేసి రాజకీయ నాయకులకు ప్రభుత్వంలోని అనేకమంది ఉన్నత పదవు ల లో ఉన్న ఉద్యోగస్తులకు వారి బాధలను విన్నవించుకొని, ఇనాం భూములకొరకు దశ్యాబ్ద కాలంగ పోరాడుతున్న ఇనాం భూబాధితులందరికి నవ్యంధ్రప్రదేశ్ లో ఇనాం భూ బాధితులకు వెన్నంటి ఉండి తన శక్తిమెరా ఎన్నో ఉద్యమాలు చేసిన నాయకుడిగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్ ఇనాం భూ బాధితుల రాష్ట్ర అధ్యక్షుడు రాటకొండ కోటేశ్వరరావు ఏలియాస్ ప్రెస్ కోటేశ్వరరావుగా పేరుగాంచిన నాయకుడి గుండెకు అత్యవసర శాస్త్ర చికిత్స చేసిన హైదరాబాదు లో ని స్టార్ హెల్త్ వైద్యాశాల వైద్యులు. ఈ వార్త రెండు తెలుగు రాష్ట్రాలలోని ఇనాం భూ బాధితులందరికీ ఎంతో బాధని కలచి వేసింది. మా ఇనాం భూముల కోసం పోరాడిన మా నాయకుడికి ఆ దేవుడు చల్లగా చూడాలని ఆయన ఆరోగ్యాన్ని తిరిగి ఆయనకు ప్రసాదించాలని ఆ దేవుని వేడుకుంటున్నామని ఆయన మరల ఆసుపత్రి నుంచి కోలుకొని మా అందరి కోసం మరల పోరాడతారని ఆశిస్తున్నామని తెలియజేసిన ఇనాం భూ బాధితులు. దశాబ్ద కాలంగా పోరాటం చేస్తున్న సర్వీస్ ఇనాం భూ బాధితులందరి ఈ రాష్ట్ర ప్రభుత్వం త్వరగా వారి సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మూడు దశాబ్దల ఇనామ్ భూ బాధితుల పోరాటం కోసం ఎన్నో ఉద్యమాలు చేసి రాజకీయాలకతీతంగా అందర్నీ ఏకతాటిపై తీసుకొచ్చానని ఈ ఉద్యమాలు రానున్న రోజుల్లో మరింత తీవ్రతరం చేసి ప్రభుత్వ ద్రుష్టి కి తీసుకువచ్చి ఈ రాష్ట్రంలోని సర్వీస్ ఇ నామ్ భూ బాధితులందరికీ న్యాయం చేయాలని ఆలోచనలు ఉన్న విధానంలో రాటకొండ కోటేశ్వరరావు గుండెకు అనుకోకుండా శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చిందని అయనా కోలుకొని ఆ దేవుడు ఆశీస్సులతో మరల ఇ నామ్ భూ బాధితుల కోసం పోరాటం చేసే దశగా అడుగులు వేస్తామని ఆ దశలో కూడా ఇనాం భూ బాధితుల కోసం ఆలోచిస్తున్నా రాటకొండ కోటేశ్వరరావు అని ఆయన ఆప్తులు మిత్రులు బంధువులు తెలియపరిచారు.

## రైతు బజార్లో గణనాథుడికి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక పూజలు



**▸▸ భక్తులకు అన్నవితరణలో పాల్గొన్న ప్రభుత్వ విప్**

**నందిగామ, సెప్టెంబర్ 18(మనం న్యూస్):** నందిగామ పట్టణంలోని రైతు బజార్ కూరగాయల మార్కెట్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నేతలు, మహిళా భక్తులతో కలిసి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులు, మహిళలు, స్థానికుల కోసం ఏర్పాటు చేసిన అన్నవితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. గణేష్ ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు సమాజ సేవకు స్ఫూర్తినిస్తున్నాయని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. గణనాథుడి ఆశీస్సులతో నందిగామ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మార్కెట్ నిర్వాహకులు, మహిళలు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# ప్రజా సమస్యల పరిష్కారానికి
# పెద్దపీట



**'ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో నమోదైన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి**
**ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలి**
**క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి ప్రజలకు సత్వర న్యాయం అందించాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**చందర్లపాడు,విజయవాడ: సెప్టెంబర్ 18,(మనం ప్రతినిధి):** ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ప్రజా సమస్యలను కేవలం అర్జీల పరిష్కారంగా కాకుండా, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. 'ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో భాగంగా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు తునికిపాటి ఫంక్షన్ హాల్ శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, నందిగామ ఎంఎల్ఏ తంగిరాల సౌమ్య, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి నాలుగు సార్లు ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నందిగామ నియోజకవర్గం చందర్లపాడులో 'ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీపై పకడ్బందీగా, పూర్తి స్థాయి విచారణ జరిపి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా రెవెన్యూ భూ సంబంధిత సమస్యలు, పంచాయతీరాజ్కు సంబంధించిన సమస్యలు తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించినట్లు వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలపై అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అర్జీలో పేర్కొన్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి, వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న అనంతరం నిబంధనల మేరకు ప్రజలకు అనుకూలంగా సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపడమే







కాకుండా, భవిష్యత్తులో అదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కల్పించడంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, భూ సమస్యలు, పంచాయతీరాజ్ తదితర అంశాలకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి సత్వర పరిష్కారం అందించడమే 'ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు' కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో గడ్డిపాటి అనిల్ కుమార్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.